నేటి దినపత్రిక
సూర్య
గురువారం
14 డిసెంబరు
2023
పేజీలు 12
ప్రకాశం
బాపట్ల

# ఏసిబి వలలో వీఆర్వో రవిశంకర్

పాస్‌బుక్ మంజూరు కోసం రూ.40 వేలు లంచం డిమాండ్



8లో...



# రైతులను కేంద్రం ఆదుకుంటుంది

**ఇంటూరు, గోవాడలో కేంద్ర బృందం పర్యటన**
**నీట మునిగిన పంటలను పరిశీలన**
**రైతులతో ముఖాముఖిగా కేంద్రం బృందం సభ్యులు**
**రైతులను ఆదుకోవాలని తెదేపా నేతల వినతి**

బాపట్ల, మేజర్‌న్యూస్: తుపానుతో నష్టపోయిన రైతులను కేంద్రం తప్పనిసరిగా ఆదుకుంటుందని కేంద్ర ప్రభుత్వ బృందం సభ్యులు, సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ మినిస్ట్రీ ఆఫ్ ఇండియా ఏ.డి. మీనా హుడా, కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు డి.విక్రమ్ సింగ్ తెలిపారు. తుపాను నష్టం అంచనాలను పరిశీలించేందుకు బాపట్ల జిల్లాకు తొలిసారిగా వచ్చిన కేంద్ర బృందం అమర్తలూరు మండలం ఇంటూరు, గోవాడ గ్రామాలలో బుధవారం పర్యటించింది. నీట మునిగిన వరి పంటను స్వయంగా పరిశీలించింది. వరి పంట పొలాలలోకి వెళ్లి మొలకెత్తిన వరి ఓదెలను కేంద్ర బృందం సభ్యులు నిశితంగా పరిశీలించారు. చేతికందివచ్చిన పంట నీట మునిగిందంటూ కేంద్ర బృందం వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గోవాడ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను బృందం సభ్యులు తిలకించారు. జిల్లాలో జరిగిన నష్టంపై ప్రాథమికంగా రూపొందించిన నష్టం అంచనాల నివేదికను కేంద్ర బృందం సభ్యులకు జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ నివేదిక అందజేశారు. రైతులతో ముఖాముఖిగా కేంద్ర బృందం సభ్యులు మాట్లాడి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు.

రైతులకు సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర బృందం సభ్యులు, కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు డి.విక్రమ్ సింగ్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్న నష్టం వివరాలను కేంద్రం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. అధికారులు ఇచ్చిన నష్టం అంచనాలు వాస్తవమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ వివరాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదికను పరిశీలించి కేంద్రానికి నివేదిస్తామని తెలిపారు. నష్టపోయిన రైతులను కేంద్రం ఆదుకునేలా మా వంతు కృషి చేస్తామన్నారు.

బాపట్లలోనే తుపాను తీరం దాటిందని దీంతో నష్టం అధికంగా జరిగిందని జిల్లా సంయుక్త కలెక్టర్

మిగతా 3లో



## కష్టపడి చదివి గొప్పస్థాయికి వెళ్లాలి

బాలికల ఆనంద నిలయం వసతిగృహాన్ని సందర్శించిన సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్




# రాజ్యాంగ ఆవశ్యకత తెలుసుకోవాలి



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: భారత రాజ్యాంగంలో భారత ప్రజలకు పౌరుల అందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ఆలోచనలను భావ ప్రకటన లోను, విశ్వాసములోను, నమ్మకము లోను, ఆరాధనలోను స్వేచ్ఛను ప్రజలందరికీ సమానంగా ఇచ్చిన ఈ రాజ్యాంగాన్ని గురించి విద్యార్థిని, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్ తెలియజేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన భారత రాజ్యాంగం దినోత్సవ సందర్భంగా గత వారంలో భారత రాజ్యాంగ విశిష్టపై ముండ్లమూరు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల నందు విద్యార్థిని నిర్వహించిన క్విజ్ పోటీలలో బహుమతి ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే దేశంలోని పౌరులందరికీ సమాన హక్కులు, అవకాశాలు, పెంపొందించుకొని విద్యార్థి, విద్యార్థులు భారత రాజ్యాంగం స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన అన్నారు. మండల ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి జె. వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 17 మరియు 21 ఆర్టికల్ పై ఏ ఒక్కరి పైన కులం, మతం, వైకల్యం పేరుతో వివక్ష చూపరాదని అందరికి సమాన అవకాశాలు కల్పించాలని పేర్కొన్నదని ఆయన అన్నారు. సి.హెచ్. మాధవి లత జిల్లా బాలికల అభివృద్ధి అధికారిని మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా 18 సంవత్సరాల లోపు బాలలు 42 హక్కులు పొందడం జరిగిందని వాటిలో ప్రధానంగా జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కులుగా వర్గీకరించడం జరిగినది ఆయన అన్నారు. కార్యక్రమానంతరం రాజ్యాంగ విశిష్టత పై జరిగిన క్విజ్ పోటీలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రత్యేక అధికారిని ఏ సునీత , డిబిఆర్సి ఏరియా కో-ఆర్డినేటర్ గోపనబోయిన వెంకట్రావు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర బృందానికి వినతి పత్రం అందించిన టీడీపీ



చెరుకుపల్లి, మేజర్‌న్యూస్: తుఫాన్ వలన నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి కేంద్రానికి నివేది ఇవ్వటానికి కేంద్రం నుండి కేంద్ర బృందం బుధవారం పర్యటించారు. తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో బాపట్ల టిడిపి ఇన్చార్జ్ నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు కలిసి కేంద్ర బృందానికి పంట అంచనా సక్రమంగా జరిపి అవుక్కతోకలు లేకుండా రైతులకు న్యాయం చేయాలని వినత పత్రాన్ని వారికి అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు దివి రాంబాబు, జివి నాగేశ్వర రావు, పి కుమారస్వామి, ఎం ఆర్ కే మూర్తి, నాగుల పున్నా రావు, శ్రీనివాస్ రెడ్డి, ఉయ్యూరు శివకృష్ణ, రాము, ఈ ఊరి దుర్గాప్రసాద్, రావూరి అప్పయ్య పాల్గొన్నారు.

## మహానటి సావిత్రి జయంతోత్సవం

రేపల్లె, మేజర్‌న్యూస్:మహానటి సావిత్రి జయంతోత్సవం ఈ నెల 15వ తేదీన శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.మాధవి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ రేపల్లె మండలం, వడ్డివారిపాలెం లో మహానటి సావిత్రి స్థాపించిన శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం సందర్శించనున్నారని తెలిపారు. స్కూల్లో జరిగే మహానటి సావిత్రి జయంతి ఉత్సవం కార్యక్రమంలో పాల్గొననున్నారన్నారు. ఈ సందర్భంగా ఈ విద్యాలయంలో చదివిన 74- 75 బ్యాచ్ పూర్వ విద్యార్థులను వారి చేతుల మీద సత్కరించనున్నారని తెలిపారు. మహానటి సావిత్రి కళాపీఠం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఏపీ మీడియా అకాడమీ సెక్రెటరీ బాలగంగాధర్ తిలక్, కళాపీఠం నిర్వాహకులు బడే ప్రభాకర్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది చెంచు నాయుడు, తిరుపతి వెంకయ్య, మండల విద్యా శాఖ అధికారి కే. సురేష్, పూర్వ ప్రధానోపాధ్యాయిని మట్టా జ్యోత్స్న, బసవతారకం హాస్పిటల్ ధినేత, తదితరులు పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి మాధవి తెలియజేశారు.

## అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల కోర్కెలు పరిష్కరించటంలో విఫలమైన ప్రభుత్వం



నగరం, మేజర్‌న్యూస్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల న్యాయమైన కోర్కెలు పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ ఆరోపించారు. బుధవారం స్థానిక మండల తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ చేస్తున్న సమ్మెలో మణిలాల్ పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సంక్షేమ పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. వీరికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవటం, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయకపోవటం లాంటి ఎన్నో సమస్యలేగాక విధి నిర్వహణలో రోజువారీ వత్తిడి పెరగటంతోపాటు యాప్స్ పేరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలంటూ చేసిన విజ్ఞప్తులు ప్రభుత్వం పట్టించుకోకపోగా అరెస్టులు చేసి నిర్బంధిస్తున్నారన్నారు. సంబంధింత అధికారులు వెంటనే స్పందించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు ఎం. శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ సిఐటీయూ నాయకులు రత్నకుమారి, రాజ్యలక్ష్మి, నళిని తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి



కొల్లూరు, మేజర్‌న్యూస్: అంగన్వాడీల న్యాయ పరమైన సమస్యను పరిష్కరించాలని కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ అన్నారు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె బుధవారం రెండవ రోజుకు చేరుకుంది.బుధవారం సమ్మెకు తెలుగుదేశం,పార్టీలు సంఘీభావం తెలియజేశాయి.ఈ సందర్భంగామైనేనిమురళి కృష్ణ మాట్లాడుతూఅంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న ప్రభుత్వం అమలుచేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు.ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే తెలంగాణకు మించి వేతనాలు ఇస్తామని హామీనిచి అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీలను మోసం చేసిందని ఆయన విమర్శించారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆయన చెప్పారు.అంగన్వాడీ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు జరిగే పోరాటాలకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు,ప్రజల సంక్షేమమే లక్ష్యంగాతమ ప్రభుత్వంపాలన సాగిస్తుందని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అంగన్వాడీల సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ఆయన ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కారం మయ్యేవరకు అంగన్వాడీలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం నాయకులు బుర్రె రాంబాబు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశుద్ధంపై శ్రద్ధ పెట్టండి: గోగన



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల ను అభివృద్ధి పేరు చెప్పి మురికివాడ చేశారు కోన రఘుపతి అని అన్నారు ఆదిశేషు.బాపట్ల జనసేన పార్టీ దివ్యాంగుల జనసైనికులు గోగన ఆదిశేషు మాట్లాడుతూ బాపట్ల పట్టణం శృంగారపురము లోని ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి కాపు కళ్యాణ మండపం వెళ్లే రోడ్లు వరకు పక్కన ఉన్న మురుగు కాలవ మరియు పరిసర ప్రాంతాలు డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని దుర్గంధం వెదజల్లుతుంది దోమలతో పందులతో అంటూ రోగాలతో స్థానిక ప్రజలు ఇబ్బంది పాలు అవుతున్నారు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ ఉన్నారు మీరు ఇలాంటి ప్రాంతాల్లో నివాసం ఉండగలరా అని అన్నారు.బాపట్ల మున్సిపల్ కమిషనర్ చెత్త పొన్ను, నీటి పొన్ను కట్టించుకోవటానికి ప్రజల్ని వేధిస్తూ ఉన్నారని. ప్రజల ఆరోగ్యాలు ఎలా పోయినా పట్టించుకోని కమిషనర్. బాపట్ల పట్టణంలో రాజకీయ నాయకులకు ప్రజల ఓట్లు అయితే కావాలి కానీ ప్రజల ఆరోగ్యాలు పట్టించుకోరు జిల్లా అభివృద్ధి అని బాపట్ల మురికివాడ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఎమ్మెల్యే కోన రఘుపతి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న చెత్తను తీసివేయాలని కాలవల్లో మురుగును తొలగించాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్ ని ఎమ్మెల్యే కోన రఘుపతి ని కోరారు.

## బీఈసీలో ఈ ఈ ఈ విభాగం ఈగల్ టెక్నాలజీస్ తో ఒప్పందం



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగం మరియు ఈగల్ టెక్నాలజీస్ సంస్థ మధ్య 13-12-2023 వ తేదీన అవగాహన ఒప్పందం జరిగినది.ఈ కార్యక్రమమునకు బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహన్ రావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, గెల్లి దిలీప్ కుమార్, జాయింట్ సెక్రెటరీ కొమ్మినేని హరి పద్మ ప్రసాద్, కోశాధికారి తాళ్లూరి రామకృష్ణ, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎన్.రమాదేవి మరియు డాక్టర్ బి.విజయ కృష్ణ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈగల్ టెక్నాలజీస్ సంస్థ వారు కళాశాలలోని ఈఈఈ విభాగము నందు ఆటో ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ వెహికల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఎస్టాబ్లిష్ చేసేందుకు గాను ఒప్పందం కుదుర్చుకోవడం ఎంతో సంతోషదాయకమని అభివర్ణించారు.పై కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులందరికీ ట్రైనింగ్ మరియు ప్రాజెక్ట్ ఇంటర్నెట్ షిప్ చేసుకొనే అవకాశం దొరుకుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎన్.రమాదేవి మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు, బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యములను పెంపొందించుకోవడానికి ఇది ఎంతో ఉపయోగకరమని హర్ష భావం వ్యక్తం చేశారు. పై కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ మాట్లాడుతూ విద్యార్థిని,విద్యార్థులు తమ నైపుణ్యాభివృద్ధిని పెంచుకోవడానికి, ఉద్యోగ సాధనకు ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాలధారణ దీక్షాపరులకు బిక్షవసతి



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన సిఎస్ పురంలోని శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో మాలధారణ చేసి దీక్షలు చేపట్టిన స్వాములకు మండలంలోని డిజిపేట గ్రామానికి చెందిన నాయకులు చీపి శ్రీనివాసులు, వెంకటలక్ష్మి దంపతులు బుధవారం భోజనవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీకామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానం పీఠం నందు ఇండ్ల వెంకటసత్యం అధ్వర్యంలో అయ్యప్ప, గోవిందా, శివ, ఆంజనేయ, భవానీ మాలధారణ స్వాములకు బిక్షవసతి కల్పించిన బిక్షదాతలను పీఠం గురుస్వాములు స్వామివారి పట్టు వస్త్రంతో సత్కరించి అభినందనలు తెలుపుతూ ఆశీర్వదించారు. ఈకార్యక్రమం లో పలువురు స్వాములు పాల్గొన్నారు.

## యేసు రత్నంకు మధుర కవి విభూషణ పురస్కారం



గిద్దలూరు, మేజర్‌న్యూస్: మేఘన సాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్ల సమ్మయ్య రూపొందించిన మధురిమలు నూతన లఘు కవితా ప్రక్రియలో 500 మధురిమలు రచించినందుకు గాను ప్రకాశం జిల్లా, గిద్దలూరు వాసి, విశ్వశాంతి మినిస్ట్రీస్ వ్యవస్థాపకాధ్యక్షులు, కవి, రచయిత కువ్వారపు యేసు రత్నం (కె.వై.రత్నం) ' మధుర కవి విభూషణ ' పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు ఈర్ల సమ్మయ్య యేసు రత్నం సాహిత్య కృషిని ప్రశంసిస్తూ సోమవారం పురస్కార పత్రాన్ని అందజేశారు. సాహిత్యంలో పలు పురస్కారాలు అందుకుంటున్న యేసు రత్నం బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పలువురు అభినందించారు.

# శింగరాయకొండ వద్ద విమాన లాండింగ్ పూర్తికి చర్యలేవి?

## పార్లమెంటులో ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి



ఒంగోలు, మేజర్‌న్యూస్: శింగరాయకొండ వద్ద ఉన్న విమాన లాండింగ్ పూర్తికి చర్యలు తీసుకోవాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. పార్లమెంటు సమావేశాలలో మాగుంట శ్రీనివాసులురెడ్డి రూలు - 377 కింద మాట్లాడుతూ దేశంలో ప్రకృతి వైపరిత్యాలు, కార్యాచరణ ఆకస్మిక పరిస్థితులు సంభవించినపుడు విమానాలు దిగుటకు ఎమర్జెన్సీ లాండింగ్ ఫెసిలిటీలు ఏర్పాటు చేసే క్రమంలో ఒంగోలు పార్లమెంటు పరిధిలో చిలకలూరిపేట, నెల్లూరు సెక్షన్‌లో శింగరాయకొండ వద్ద కూడా 3.60కి. మీ. మేర ఒకటి ఏర్పాటు చేస్తున్నందుకు ప్రధాన మంత్రికి, కేంద్ర రోడ్డు - హైవేల శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ లాండింగ్ ఫెసిలిటీకి సంబంధించి నేషనల్ హైవే అథారిటీ, కాంట్రాక్టర్ మధ్య 26-12-2019 అగ్రిమెంటు జరిగి, ప్రధాన సివిల్ పనులు 20-12-2021 నాటికి పూర్తి అయ్యాయి. 28-07-2021 తేదీన భారత విమాన సంస్థ, నేషనల్ హైవే అథారిటీ వారు జరిపిన జాయింట్ ఇన్స్పెక్షనులో మైనర్ బెండ్స్ (చిన్న వంకలు) కర్వ్ (మలుపు)లను గుర్తించారు. ప్రాజెక్టు డైరెక్టర్, నేషనల్ హైవే అథారిటీ, నెల్లూరు, విమాన సంస్థ, కాంట్రాక్టర్లు, సలహాదారులు జరిపిన జాయింటు తనిఖీలో చిన్న వంకలును, మలుపును వాటిని నిటారుగుగా వేయుటకు గల అవకాశాలను అన్వేషించడం కూడా జరిగింది. తదుపరి, సదరు పనులకు, భూసేకరణకు రూ 26.60 కోట్లు అంచనాతో విజయవాడలోని నేషనల్ హైవే అథారిటీ రీజినల్ ఆఫీసరు ఆమోదానికి 25-01-2023న పంపడం కూడా జరిగింది. 11 నెలల గడచినను, త్వరితగతిన పూర్తి చేయవల్సిందిగా కేంద్ర మంత్రి ఆదేశాలు ఇచ్చారు. సదరు పని ఇప్పటికీ పెండింగులోనే ఉంది. పనికి అత్యధిక ప్రాదాన్యత నిచ్చి, అంచనాను వెంటనే ఆమోదించి జాతీయ ప్రాధాన్యత సంతరించుకున్న ఈ ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేయావల్సిందిగా ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరినట్లు మాగుంట కార్యాలయం ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి ప్రకటన ద్వారా తెలియజేశారు.



2001 డిసెంబర్ 13న పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి.

# రాష్ట్రంలో 35 స్థానాల నుంచి సిపిఐ పోటీకి సిద్ధం

## ప్రకాశంలో కనిగిరి, ఎర్రగొండపాలెంలో సిపిఐ పోటీ

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య



ఒంగోలు, మేజర్‌న్యూస్ : కమ్యూనిస్టులు లేని చట్టసభలలో ప్రజా సమస్యలు పరిష్కారం కావని,తెలంగాణ స్ఫూర్తితో 2024 సార్వత్రిక ఎన్నికలలో ఏపీ శాసనసభలో సిపిఐ అభ్యర్థులు అడుగు పెట్టడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా సిపిఐ జిల్లా సమితి సమావేశం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ దర్శి మండల కార్యదర్శి ఎం రమేష్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జి ఈశ్వరయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ అభ్యర్థులు పోటీ చేసేందుకు 35 అసెంబ్లీ స్థానాలను గుర్తించడం జరిగిందన్నారు. ప్రకాశం జిల్లా నుండి కనిగిరి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల నుండి సిపిఐ అభ్యర్థులు బరి లో నిలుస్తారు అన్నారు. అభ్యర్థుల గెలుపు కోసం ఇప్పటినుండి ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో ఇండియా కూటమిని వదిలి సొంత నిర్ణయాలతో కాంగ్రెస్ పోటీ చేయటం ద్వారా బిజెపికి కలిసి వచ్చిందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలలో కనీసం మూడు రాష్ట్రాలు బీజేపీ వ్యతిరేక ప్రభుత్వ ఏర్పడి ఉంటే ఆ ఉత్సాహంతో రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఇండియా కూటమికి మరిన్ని విజయ అవకాశాలు ఉండేది అన్నారు. కానీ కాంగ్రెస్ చేసిన తప్పిదం వల్ల నేడు ఇండియా కూటమి పార్టీలు మరింతగా కష్టపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది అన్నారు. దీనిలో కాంగ్రెస్ పార్టీ గొప్పతనం ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, సిపిఐ, సిపిఎంలు కలిసి పోటీ చేయటమే లక్ష్యంగా సిపిఐ భావిస్తుందన్నారు. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తుందన్నారు. చంద్రబాబు అరెస్టు వెనుక ప్రసాద్ మోడీ, హెూమ్ మినిస్టర్ అమిత్‌షా చేయి ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ రాజన్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి కార్యకర్త కష్టించి పని చేయాలి అన్నారు. పార్టీ శాఖలు సభ్యత్వాన్ని పునరుద్ధించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. వెంకట్రావు, పి.వి.ఆర్. చౌదరి, డి. శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె నాసరయ్య, వి. హనుమారెడ్డి, కె. వీరారెడ్డి, యస్.డి. మౌలాలి, ఆర్. రామకృష్ణ, పి. ప్రభాకర్, యం. విజయ, యస్. రావమ్మ జిల్లాలోని అన్ని మండల కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: సీతారాం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా ప్లీనం సమావేశం బుధవారం సుందరయ్య భవనంలో జరిగింది సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంతెన సీతారాం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మిచౌంగ్ తుఫాను రాష్ట్రంలో రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది అన్నారు పంట చేతికి వచ్చే సమయంలో విచాంగ్ తుఫాను రావడం వల్ల పంట తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు దీంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. నష్టపోయిన రైతుల్ని ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం మీన వేషాలు లెక్కిస్తుందని విమర్శించారు సీఎం జగన్మోహన్ రెడ్డి క్యాంప్ ఆఫీసు నుంచి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం తప్ప పని జరగటం లేదని విమర్శించారు. తుఫాను వెళ్లి వారం రోజులు పూర్తయినా ఇంతవరకు ఒక్క రైతుకు కూడా నష్టపరిహారం చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దెబ్బతిన్న పంటకు ఎన్యుమరేషన్ ఇంత వరకు చేయలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దెబ్బతిన్న పంటకు ఎన్యుమరేషన్ చేసి నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు వెంటనే రిపేరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టు రెండవ గేటు విరిగిపోయిందన్నారు గేటును రిపేర్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. 16 నెలల కిందట ప్రాజెక్ట్ 3వ గేటు విరిగిపోయిన దానిని రిపేర్ చేసేందుకు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రాజెక్టు గేట్లు రిపేరు చేసేందుకు నిధులు కేటాయించాలను డిమాండ్ చేశారు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు జిల్లాలో ఒక మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించి నివారణకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి, ఎస్కే మాబు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, ఎం. రమేష్, ఊసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, డిసోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు , కార్యదర్శులు పాల్గొన్నారు.







# రైతులను కేంద్రం ఆదుకుంటుంది

**మొదటి పేజీ తరువాయి** సిహెచ్ శ్రీధర్ తెలిపారు. కేవలం 24 గంటలలోనే 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందన్నారు. సుమారుగా రూ.49 కోట్ల మేర నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు కేంద్ర బృందానికి తెలిపారు. జిల్లాలో మొత్తం 93,244 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని కేంద్ర బృందం సభ్యులకు వివరించారు. అందులో 75,411 హెక్టార్లలో వరి పంట దెబ్బతినిందని, 363 హెక్టార్లలో వేరుశనగ పంట, 9,232 హెక్టార్లలో పొగాకు పంట, 238 హెక్టార్లలో జొన్న, 3,530 హెక్టార్లలో మొక్కజొన్న, 738 హెక్టార్లలో కంది పంట, 1,129 హెక్టార్లలో పత్తి, 2,034 హెక్టార్లలో మినుము, 50 హెక్టార్లలో చెరుకు, 446 హెక్టార్లలో జనపనార, 73 హెక్టార్లలో పెసర పంటలు దెబ్బతిన్నాయని ప్రాథమికంగా అంచనాలు వేశామని తెలిపారు. సుమారుగా రూ.10 కోట్ల మేర నష్టం జరిగినట్లు వివరించారు. 74 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 1,388 మంది బాధితులకు ఆశ్రయం కల్పించామన్నారు. తుపాను ప్రభావంతో 11 వేల కుటుంబాలు నష్టపోయాయని తెలిపారు. 132 గృహాలు దెబ్బతినగా, జిల్లాలో 65 రోడ్లు దెబ్బతిన్నాయని, జాతీయ రహదారులకు రూ.10 కోట్లు, రాష్ట్రీయ రహదారులకు రూ.ఐదు కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. 400 విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించామన్నారు. 40 కల్వర్టులు దెబ్బతినగా, 100 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని కేంద్ర బృందం సభ్యుల దృష్టికి ఆయన తెచ్చారు. జిల్లాలో పరిస్థితిని ఆయన స్పష్టంగా వివరించారు. రైతులకు మేలు చేయాలని ఆయన కోరారు. రేపల్లె ఆర్డీవో బి.ఎస్. హేలా షారోన్, వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్, ఉద్యాన శాఖ అధికారి జె.జెన్నమ్మ, ఏపీఎంఐపి పీడీ వెంకటరమణ, తదితర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోండి: తెదేపా నేతల వినతి

మిచౌంగ్ తుపాను ధాటికి రాష్ట్రంలో జరిగిన పంట నష్టం అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందాన్ని రైతుల్ని ఆదుకోవడంలో అధికారులు ఉదారంగా వ్యవహరించాలని తెలుగుదేశం పార్టీ నేతలు కోరారు. ఈ మేరకు కేంద్ర బృందాన్ని కలిసి వినతిపత్రం అందించారు. దెబ్బతిన్న పంటలను దగ్గరుండి అధికారులకు చూపారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకోవాలని విన్నవించారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలంలో మచిలీపట్నం పార్లమెంటు అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు, నియోజవర్గ ఇంచార్జ్‌లు దెబ్బతిన్న పంటలను చూపించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, తంగిరాల సౌమ్య, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వేముల శివాజీ తదితరులు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లిలో పర్యటించిన కేంద్ర బృందాన్ని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జ్ వేగేశన నరేంద్ర ఆధ్వర్యంలో పంటలను చూపించారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని, మీరైనా రైతాంగాన్ని కాపాడాలని వినతిపత్రం అందజేశారు.

## డిమాండ్ల సాధనకై అంగన్వాడీల ర్యాలీ



కంభం, మేజర్‌న్యూస్: వేతనాలు పెంచాలని అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ అండ్ బీ బంగ్లాలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి మద్దతు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తెలుగుదేశం హయాంలో అంగన్వాడీలకు రెండుసార్లు వేతనాలు పెంచడం జరిగిందని గుర్తు చేశారు. 2019 ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాడని, నేడు న్యాయబద్ధంగా కనీస వేతనాలు చెల్లించాలని మహిళలు రోడ్డెక్కితే ఈ గుడ్డి ప్రభుత్వం చలనం లేకుండా నిద్ర పోతుందని ఇక ఇకనైనా ఈ ప్రభుత్వం కళ్లు తెరచి అంగన్వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఏఐటీయూసీ నాయకులతో పాటు కంభం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 15న 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం



కనిగిరి, మేజర్‌న్యూస్: కనిగిరి ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఈ నెల 15వ తేదీన డయల్ యువర్ డి.ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కనిగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ బి. శ్రీమన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ అందిస్తున్న సేవల పై,సౌకర్యాల పై,ప్రయాణికుల సలహాలు, సూచనలను 99592 25701 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

## బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కి గ్యారంటీ



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: రాష్ట్ర పార్టీ అదేశాల మేరకు సంతనూతలపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జి బి.ఎన్.విజయ్ కుమార్ సూచనలతో బుధవారం సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట 39వ డివిజన్ మర్రిచెట్లకాలనిలో బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి తిరుగుతూ టీడీపీ మ్యానిపేస్ట్ గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, 39వ డివిజన్ తెలుగు మహిళా నాయకురాలు అరికట్ల సుమతి, 96వ బూత్ ఇంచార్జి షైక్ అమానుల్లా, బడే సాహెబ్, టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీలోకి చేరిన టీడీపీ కుటుంబాలు



చీమకుర్తి, మేజర్‌న్యూస్: మండలంలోని తొర్ర గుడిపాడు సచివాలయం పరిధిలో చీమకుర్తి మండలం ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపి పార్టీ నుంచి 10 కుటుంబాలు వైఎస్ఆర్సిపి పార్టీలో చేరడం జరిగింది. చీమకుర్తి మండల పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, జెసిఎస్ చీమకుర్తి మండల కన్వీనర్ చిన్నపరెడ్డి మస్తాన్ రెడ్డి వారిని కండువాలు కప్పి వైఎస్ఆర్సిపి పార్టీలోకి ఆహ్వానించారు.

# సీయం జగన్ పాలనలోనే రాష్ట్ర ప్రజలు సురక్షితం

**తొర్రగుడిపాడులో 'వై ఏపి నీడ్స్ జగన్'లో యంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు**



చీమకుర్తి, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలోనే సురక్షితంగా ఉన్నారని యంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ యద్దనపూడి అంజనీదేవి పేర్కొన్నారు. బుధవారం చీమకుర్తి మండలంలోని తొర్రగుడి పాడు గ్రామం లో ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ యద్దనపూడి అంజనీ దేవి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధిగా యంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు హాజరయ్యారు. సచివాలయ పరిధిలో ప్రజలు పొందిన సంక్షేమ లబ్ధి రూ.13కోట్ల వివరాలను తెలిపే ప్రగతి నివేదికను యంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా యంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేసిన వ్యక్తి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. సంక్షేమ పథకాలు మళ్లీ అమలు కావా లంటే ఖచ్చితంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఉండాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పాలన నూటికి నూరు శాతం అందిం చారన్నారు. గత ప్రభుత్వానికి జగన్ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. తొలుత పార్టీ శ్రేణులతో కలసి వైసిపి జెండాను యంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మం డల పార్టీ కన్వీనర్ పమిడి వెంకటేశ్వ ర్లు, మండల సచివాలయ కన్వీనర్ సిహెచ్ మస్తాన్‌రెడ్డి, యంపిడిఓ రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి పి.శంకర్, ప్రసాద్‌రెడ్డి, వైయస్ఆర్ పార్టీ నాయ కులు కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, శేషు, ఏడుకొండలు, కౌశిక్, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పంట నష్ట పరిహారం విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



భట్టిప్రోలు(వేమూరు) మేజర్‌న్యూస్: మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచే పరిహారం విషయంలో ప్రభుత్వ స్పష్టత ఇవ్వాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,కుచ్చళ్ళపాడులో విలేకరులతో ఆమె మాట్లాడుతూ మిచాంగ్ తుఫాను సంభవించి వారం రోజులు అవుతున్నా ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చి తుఫాను కారణంగా పాడైపోయినటువంటి పంటలను పరిశీలించడం జరిగింది తప్పా నష్టపోయినటువంటి రైతులకు అందించే పరిహారం విషయంలో ప్రభుత్వం స్పష్టమైనటువంటి హామీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు,ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కేవలం రాజకీయ ప్రాధాన్యతలే చూసుకుంటున్నారు తప్ప నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సదుద్దేశం లేకపోవడం విచారకరమన్నారు,కేవలం రాజకీయ కోణంలో ఆలోచన చేస్తూ ప్రజల గోడు పట్టించుకోకుండా ప్రతిపక్ష పార్టీలపై విమర్శలకు దిగటం వైసీపీ మంత్రులకు,నాయకులకు అలవాటైందన్నారు, జనసేన పార్టీ తెలంగాణలో పోటీ చేసి బంగపడిందని చెబుతున్న వైసిపి,జాతీయ పార్టీగా ఉండి తెలంగాణలో ఎందుకు పోటీ చేయలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునే విషయంలో చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి హామీ పథకం మేట్‌లకు శిక్షణ



టంగుటూరు, మేజర్‌న్యూస్: స్థానిక ఉపాధి హామీ కార్యాలయము నందు బుధవారం ఏపీఓ సుభాషిని అధ్యక్షతన ఉపాధి హామీ మేట్‌లకు శిక్షణ కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమమునకు మండలంలోని కారుమంచి, కందులూరు, మర్లపాడు, మల్లవరపాడు, ఎం.నిడమనూరు, కొణిజేడు గ్రామాలకు సంబంధించిన మేట్ లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమమునకు ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వెంకటస్వామి పాల్గొని మాట్లాడుతూ ఉపాధి కూలీల కొలతలు ప్రకారమే పనిచేయించాలని తెలిపారు. కూలీలకు సరైన వేతనం వచ్చేలా మేట్‌లు కొలతలు చూసుకోవాలని తెలిపారు. కెపాసిటీ బిల్డింగ్ ఏపీ డి.బసవ సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ మేట్‌లకు తగిన సూచనలు, సలహాలు తెలిపారు, కూలీలలో ఎక్కడ తప్పులు లేకుండా చూసుకోవాలని, కూలీలకు తగిన వేతనం వచ్చేలా చూడాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఈసీ, టిఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ ధారా రవికిరణ్మయి చన్నయ్య అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన వికసిత భారత సంకల్పయాత్ర సందర్భంగా జరిగిన సభకు గృహ నిర్మాణ సంస్థ ఏఈ రావూరి సౌమ్య రేవతి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రవికిరణ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్,గరీబ్ కళ్యాణ యోజన,దీనదయాల్ యోజన,కిసాన్ క్రెడిట్ కార్డ్,అటల్ పెన్షన్ యోజన,సురక్ష బీమా యోజన,జీవన జ్యోతి బీమా యోజన,జన్ దన్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.భట్టిప్రోలు జడ్పీటిసి సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి బాలాజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలను, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పథకాలను అమలులోకి తీసుకురావడం జరుగుతుం దన్నారు. ఈ పథకాలను అర్హత ఉన్న ప్రతి వారు సద్వినియో గపరుచుకోవాలని కోరారు. వికసిత భారత్ సంకల్ప యాత్ర వాహనంలో పలు సందేశాత్మక వీడియోలు, పథకాలకు సంబంధించిన వివరాలను,దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సందేశాన్ని ప్రదర్శించడం జరిగింది. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో తాహ సిల్దారు ధూళిపూడి వెంకటేశ్వరరావు, ఈవో పి ఆర్ డి టి ఊహారాణి,గ్రామ పంచా యితీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వాలం టీర్లు,వైద్య శాఖ సిబ్బంది,పలు పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రభుత్వానికి మహిళల బుద్ధి చెప్పాలి

రేపల్లె, మేజర్‌న్యూస్: అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా వారిని వేదింపులకు ఈగురిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మహిళలు పోరా టాల ద్వారా బుద్ధి చెప్పాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు జి. వి. నాగేశ్వరరావు, పిలుపునిచ్చారు. అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తాలూకా కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె బుధవారం రెండవ రోజుకు చేరుకుంది. బుధవారం సమ్మెకు తెలుగు దేశం, జనసేనా పార్టీలు సంఘీభావం తెలియజేశాయి. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చి రెండు సంవత్సరాలు గడు స్తున్న ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే తెలంగాణకు మించి వేత నాలు ఇస్తామని హామీనిచి అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీలను మోసం చేసిందని ఆయన విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆయన చెప్పారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు జరిగే పోరాటాలకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు. జన సేనా పార్టీ నాయకులు మహేష్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తుం దని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకా లంగా అపరిష్కృతంగా ఉన్న అంగన్వాడీల సమస్య లను ఎందుకు పరిష్కరించడం లేదని ఆయన ప్రశ్నిం చారు. తమ సమస్యలు పరిష్కారంమయ్యేవరకు అంగన్వాడీలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు అనగాని శివ ప్రసాద్, జి.పి. రామారావు, బొమ్మిడి రామకృష్ణ, గుర్రం మురహరి రావు, అనగాని శ్రీనివాసమూర్తి, తేజ, పొన్నూరు గౌరీ రామ కుమారి విశ్రాంత ఉద్యోగుల పెన్షనర్ల అసోసియేషన్ నాయకు లు కె. వెంకటేశ్వరరావు, జనసేనా నాయకులు జానకీ రావు, ఎఐటియుసి రాష్ట్ర సమితి నాయకులు పి. నాగాంజనేయులు, అంగన్వాడీ అసోసియేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ జి. నాగమల్లేశ్వరమ్మ, కనగదుర్గ, అనూష, అనిత, విజయ, ఉమా, సునీత, శ్రీలేఖ, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



నిజాంపట్నం, మేజర్‌న్యూస్ : జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను ఈ నెల 9, 10 తేదీల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్ ఒంగోలులో నిర్వహించారు.ఈ పోటీలకు బాపట్ల జిల్లా నుంచి 33 మంది క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారు.వారిలో జిల్లాకు చెందిన 33 మంది క్రీడాకారులు పాల్గొని 10 బంగారు, 13 రజిత, 10 కాంస్య పతకాలు సాధించారు.వారిలో బంగారు పతకాలు సాధించిన వారు కె.గురుమణివర్మ, డి.రెశ్వంత్ రెడ్డి, కె.రాకేష్ రెడ్డి, డి.భాను ప్రకాష్ రెడ్డి, వై.హరిద్రాణి, షేక్.బాజీ, షేక్.ఆర్షి, కె.దుర్గాభవాని, కె.తేజ సుదీక్ష, ఏ.లక్ష్మి తిరుపతమ్మ లు ఉన్నారు.వీరు నేపాల్ దేశంలో జనవరిలో జరుగునున్న అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు.ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విజేతలను జిల్లా తైక్వాండో సెక్రటరీ కె.శ్రీనివాసరావు, ఇంటర్నేషనల్ రిఫరీ హోల్డర్ వైస్ సెక్రెటరీ ఈ.విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పి.బాబూరావు, పి.సిరాజ్ ఆలీఖాన్, పి.బాజీ, కోచ్ నాగరాజు లు ప్రత్యేకంగా అభినందించారు.

## వైభవంగా అయ్యప్ప భజనలు, పడిపూజ



కర్లపాలెం ,మేజర్ న్యూస్.కర్లపాలెం మండలం పాతనందయపాలెం గ్రామస్తులు ,అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో కని విని రీతిలో అంగరంగ వైభవంగా భజనలు ,పడిపూజ కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా శివ లింగంకు అర్చకులు ,అభిషేకాలు ,అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి భజనలు చూపరులను ఉర్రుతలుగించాయి.కర్లపాలెం మండలం ఇప్పటి వరకు జరగని విధంగా నిర్వహించడంతో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించడంతో అయ్యప్పస్వాములు ,ప్రజలతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

## దానాల్లో కల్ల అన్నదానం గొప్పది

### - జడ్పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



దర్శి, మేజర్‌న్యూస్: అన్నం పరబ్రహ్మ స్వరూప అని దానాలలో కల్ల అన్నదానం గొప్పదని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. దర్శి కొత్త పాలెం అయ్యప్ప స్వామి గుడిలో మహిళలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంను జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమెల్యే శివ ప్రసాద్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాలధారణ చేసిన స్వాములకు మహిళలు అన్నదానం చేయడం అభినందనీయమని అన్నారు. శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మాలధారణ చేసిన స్వాములకు అన్నదానం చేయటం శుభపరిణామం అని, అందరి మధ్య ఐక్యతకు దోహద పడుతుందన్నారు. తమ కుటుంబం గత 25సంవత్సరాలు నుండి స్వాములకు అన్నదానం చేస్తున్నామని అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముందుగా దేవాలయంలో పూజలు నిర్వహించారు. మాలధారణ చేసిన స్వాములకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే స్వయంగా వడ్డించారు. అనంతరం వెంకాయమ్మ, శివ ప్రసాద్ రెడ్డిలను మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# 'మన ఊరు - మన ఉగ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



పామూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని నెల్లూరు రోడ్డులోని పువ్వాడి రాధాకృష్ణ ఫంక్షన్ హాల్ వద్ద నుంచి మన ఊరు మన ఉగ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నేడు జరుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పట్టణంలోని శేష మహల్ కాంప్లెక్స్‌లోని టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఉదయం ఎనిమిది గంటలకు పట్టణంలో ఉగ్ర నూతన గృహప్రవేశం, మన ఊరు మన ఉగ్ర, బాబు సూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరుగుతు ందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరవుతున్నారన్నారు. మండలంలోని తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు,

### సమావేశంలో పువ్వాడి వెంకటేశ్వర్లు పిలుపు

టిడిపి జనసేన నాయకులు సయ్యద్ అమీర్ బాబు, మార్నేని రామకృష్ణ, యిర్రి కోటిరెడ్డి, షేక్ గౌస్‌బాషా, పువ్వాడి రామారావు, మన్నం రమణయ్య, పువ్వాడి వెంకట్ చౌదరి, దేవరపు మాల్యాద్రి, గుంటుపల్లి శ్రీనివాసులు, షేక్. రహీముల్లా, షేక్ సంధాని, యారవ ప్రసాద్ రెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, మోరుబోయిన హుస్సేన్ రావు యాదవ్, పాలపర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సర్వ సభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు రాక పోవటం బాధాకరం




కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు రాకపోవటం వలన మండలం లోని ప్రజల సమస్యలు గానీ వాటి పరిష్కారాలు గానీ చేయలేక నిరసన తెలుపుతూ సర్వ సభ్య సమావేశాన్ని బై కాట్ చేసినప్పటికీ అధికారులలో మార్పు రాకపోవటం చాలా బాధాకరం అని నల్లమోతు వారి పాలెం సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు తెలియ జేశారు. ఈరోజు జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో అధికారుల అలసత్వాన్ని తీవ్రంగా ఖండించారు. ఒక వైపు మించాంగ్ తుఫాన్ కారణంగా మండలంలో రైతులు అల్లాడుతుంటే పంటను కాపాడటానికి డ్రైనేజ్ అధికారులు తీసుకున్న చర్యలు తెలపటానికి అదేవిధంగా పంట కాలువల పరిస్తితి తెలుసుకోవటానికి నీటి పారుదల శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనకపోవడం చాలా బాధాకరం అని తెలియ జేశారు. మండలంలో తుఫాన్ కారణంగా చాపల చెరువులు వేసిన రైతులు సమస్యల పై సమాచారం ఇవ్వటానికి మత్స్య శాఖ అధికారులు ఇంకా కొన్ని శాఖల అధికారులు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి రాకపోవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో ప్రజలకు ఏ సమస్యలు ఉన్నాయో స్థానిక ప్రజా ప్రతినిదులకే తెలుసు కనుక మండల పరిషత్ లోని నిధులు స్వేచ్ఛగా వాడుకొనే విధంగా ఎంపీటీసీ లకు వెసులు బాటు ఇవ్వాలని కోరారు. మండలంలో ఎక్కడో ఒక ఎంపీటీసీ కి ఒక లక్ష రూపాయల వర్క్ ఆర్డర్ ఇవ్వటం లేట్ అయితే మండల పరిషత్ పరువు దిగజారింది అని అనటం కరెక్ట్ కాదు అని తెలియ జేశారు. ఒక దళిత మహిళ ఎంపీపీ గా ఉంటే సహకరించకుండా పక్కన గుడి లో మీటింగ్ ఏర్పాటు చేసుకున్నప్పుడు మండల పరిషత్ పరువు పోలేదా అని ప్రశ్నించారు. అన్ని శాఖల అధికారులు వచ్చి సమగ్ర సమాచారం ఇచ్చే విధంగా మండల పరిషత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



కనిగిరి, మేజర్‌న్యూస్: సిఐటియు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యలకు పరిష్కారం కోరుతూ బుధవారం కనిగిరి పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసికేశవరావు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ 26వేలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాడ్యుటి అమలు చేయాలని కోరారు. మినీ అంగన్వాడి సెంటర్స్‌ని మెయిన్ సెంటర్స్‌గా అప్గ్రేడ్ చేయాలని, మినీ అంగన్వాడీ వర్కర్స్‌కు ప్రమోషన్స్ ఇవ్వాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హెల్పర్స్ ప్రమోషన్లలో నిబంధనలు పాటించాలని, వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వమే కేంద్రాలకు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని, సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మనోరంజిత, రజిని, సీత, రాజ్యలక్ష్మి, నారాయణమ్మ, అమల, అనిత, కవిత, భాగ్య లక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూని యన్ నాయకులు ఎస్కే ఖాదర్ వలీ పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలి



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పులుగుజ్జు ఫ్రాంక్లిన్ మాదిగ అన్నారు. బుధవారము పట్టణంలోనిమాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే యస్.సి వర్గీకరణకు చట్టబద్దత కల్పించి మాదిగల చిరకాల వాంఛ తీర్చాలని అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ ఉద్యోగులు సమీక్ష అలాగే మహాజన సోషలిస్టు పార్టీ, వికలాంగుల పోరాట సమితి అన్ని అనుబంధ సంఘాల ఈ నెల 17వ తేదీ ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరుగునని ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని ఎంఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి పులుగుజ్జు ఫ్రాంక్లిన్ మాదిగ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని విభాగాల నాయకులు ముఖ్య కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈ నెల 17వ తేదీన సెమీ క్రిస్మస్ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని భవిష్యత్ ప్రణాళికను ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎన్‌ఎస్‌పివి హెచ్‌పిఎస్ అనుబంధ సంఘాల పూర్తి నిర్మాణం మీద దృష్టి పెట్టాలని పుల్లుగుజ్జు ఫ్రాంక్లిన్ మాదిగ తెలిపారు. అన్ని అనుబంధ సంఘాలు 17వ తేదీన ఒంగోలులో జరిగే సెమి క్రిస్మస్ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, అభిమానులు శ్రేయోభిలాషులు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సీనియర్ నాయకులు గుర్రం బాబూరావు, కొండేపోగు దేవప్రభాకర్, బొప్పూరి ప్రసాద్, మండల నాయకులు కొమ్మునూరి వెంకటేష్, పందిటి యిర్మీయా తదితరులు పాల్గొన్నారు.

## ఎకరాకు 38 బస్తాలు దిగుబడి



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలోని ఊళ్ళగల్లులో ఒక ఎకరా వరి కోత కొసి నుర్పిడి చేస్తే 38బస్తాలు చొప్పున దిగుబడి వస్తుందని దర్శి ఎ.డి.ఎకె.బాలాజీ నాయక్ తెలిపారు. ఊళ్ళగల్లు గ్రామంలో ప్రధాన మంత్రి పసల్ భీమా యోజన పథకం కింద ఎంపిక చేసిన వరి పంటలో పంట కోత ప్రయోగం నిర్వహించారు.5ఐ5 మీటర్లులో 19.150కేజీలు దిగుబడి వచ్చింది. ఈ ప్రకారం ఒక ఎకరలో 41బస్తాలు దిగుబడి వచ్చింది అని అన్నారు. అం దులో తేమ 1శాతం తీసివేయగా 38బస్తాలు ఎకరాకు దిగుబడి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయ అధికారి ఫరుక్, ఆర్.బి.కె సిబ్బంది జె.ఆంజనేయులు, రైతులుపాల్గొన్నారు.

## విద్యార్థులకు మెటీరియల్ అందచేత



దర్శి, మేజర్‌న్యూస్: మండలంలోని కొత్త పల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మెటీరియల్‌ను ఎ.పి.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు వాకా జనార్దన్ రెడ్డి అంద చేశారు. బూచేపల్లి సుబ్బారెడ్డి వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 2024లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు యస్.యస్.సి మెటీరియల్‌ను కొత్తపల్లి హైస్కూల్‌లో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెటీరియల్‌ను విరాళంగా ఇచ్చిన ప్రకాశం జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివ ప్రసాద రెడ్డి కొత్తపల్లి పాఠశాల హెచ్.యం స్టాఫ్ తరపున ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌యం ఎస్.కిరణ్ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళా విభాగం అధికార ప్రతినిధిగాఅరవింద



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధిగా భట్టిప్రోలు కు చెందిన జి.అరవింద నియామకం జరిగినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు అందాయి. అరవింద మాట్లాడుతూ తనకు పదవి కల్పించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ మే రుగ నాగార్జునకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రజారంజక పాలన సాగుతుందని,రానున్న సార్వత్రిక ఎన్నికలలో తిరిగి అధికారాన్ని చేపట్టే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె తెలిపారు.గత 20 సంవత్సరాలుగా వేమూరు నియోజకవర్గం లో ప్రజలకు అత్యంత చేరువైన మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జునను వేమూరు నుంచి,పార్టీ అధిష్టాన వర్గం సంతనూతలపా డుకు ఇన్చార్జిగా నియమించటం జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ఇప్పటికైనా అధిష్టానం పునరాలోచించాలని ఆమె కోరారు.ఈ సమావేశం లో పప్పల గ్రేట్ అరుణ శాస్త్రి పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తుఫాన్‌తో దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలన



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సంతనూతలపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జి బి.ఎన్.విజయ్ కుమార్ సూచనలతో బుధవారం బాపట్ల పార్లమెంట్ రైతు అధ్యక్షులు నెప్పలి సుబ్బారావు ఆధ్వర్యంలో సంతనూతలపాడు నియోజకవర్గంలో నాగులుప్పలపాడు మండలం చేకూరపాడు గ్రామంలో, మద్దిపాడు మండలం మల్లవరం గ్రామాలలో మొన్న మిచాంగ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతులకు ఎకరానికి 30 వేలు రూపాయలు చెప్పున ప్రభుత్వం వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సెక్రటరీలు ఆడక స్వాములు, దుపాటి యేసేబు, బాపట్ల పార్లమెంట్ రైతు అధ్యక్షులు నెప్పల సుబ్బారావు, నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, మద్దిపాడు మండల పార్టీ అధ్యక్షులు మండవ జయంత్ బాబు, ఎన్.ఎస్.పాడు మండల పార్టీ అధ్యక్షులు తెళ్ళ మనోజ్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు కరణం మోహన్, మార్నెని సుబ్బారావు, మార్నెని శంకర్, వరహాలు చౌదరి, మండవ గోపి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే స్వామి



సింగరాయకొండ, మేజర్‌న్యూస్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందిస్తామని కొండెపి శాసనసభ్యులు డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. బుధవారం మూలగుంటపాడు గ్రామపంచాయతీ పరిధిలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి మహిళకు ఉచితంగా బస్సు సదుపాయం కల్పిస్తామని, ప్రతి కుటుంబంలో 18 వేళ్ళు నిండి ఎంతమంది మహిళ ఉన్నా 1500 నగదును ఉచితంగా అందిస్తామని, నిరుద్యోగులకు 3000, మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి ఏట అన్నదాతలకు 20,000, తల్లికి వందనం కింద ప్రతి కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా 15000 రూపాయలు, ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని తెలిపారు. గత తేదేపా ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసి బీసీ కులాల అభివృద్ధికి అడ్డుకట్ట వేశారని తెలిపారు. ఈ కార్పొరేషన్‌కు అధికంగా నిధులు మంజూరు చేసి వారి అభివృద్ధికి తోడ్పడుతామని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేల్పుల సింగయ్య, మండల ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ చైతన్య, జిల్లా న్యాయవిభాగం అధ్య క్షులు సన్నిబోయిన శ్రీనివా సులు నాయుడు, నాయకులు కూనపరెడ్డి సుబ్బారావు, నరాల సుధాకర్, శీలం చంటి, అంబటి శ్రీను, గుడే వెంకటేశ్వర్లు, పార్టీ నాయ కులు పాల్గొన్నారు.

# వైసీపి అరాచక పాలనలో అభివృద్ధి శూన్యం: మాజీ ఎమ్మెల్యే ఉగ్ర



కనిగిరి, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపి పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విమర్శించారు. మున్సిపాలిటీలోని 19 వార్డు దొరువు బజార్ లో మన ఊరు మన ఉగ్ర, భవిష్యత్‌కు గ్యారెంటీ బాబు ష్యురిటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి మొదటి రోజు నుండే దోపిడి పాలన చేస్తున్నారని అన్నారు.టీడీపి అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపాలిటిలో త్రాగునీరు, రహదారులు, మౌలిక వసతులు కల్పించి అన్ని విధాల అభివృద్ధి చేస్తామని చెప్పారు. చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు మళ్ళీ సీఎం కావాల్సిన అవసరం ఉంద న్నారు.సంక్షేమం పేరుతో రాష్ట్రంలో అభివృద్ధిని విస్మరించారని తెలిపారు. టీడీపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డ నిధి ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ యువకులకు నిరుద్యోగ భృతి, దీపం పథకం ,ప్రతి ఇంటికి ఉచిత మంచినీటి కుళాయి ,ట్రిపుల్ ఐటి ,వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు తమ్మనేని శ్రీనివాసులు రెడ్డి, యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్, పార్లమెంట్ అధికార ప్రతినిధి తమ్మ నేని వెంకటరెడ్డి, వివిఆర్ మనోహరరావు, మైనార్టీ సెల్ అధ్య క్షులు షేక్ అహ్మద్, వార్డు అధ్య క్షులు అహ్మద్, బుల్లా బాలబాబు, తిరు పాలు, గుడిపాటి ఖాదర్, షఫి, జిలాని, ఫిరోజ్, సుబ్బ య్య, రహి మాన్, ముశే బ్రహ్మ రెడ్డి, రిజ్వాన్, మిన్ను, జనసేన నాయ కులు రమేష్, ఆంజనాయుడు, దొరస్వామి నాయుడు, కరణం, వాజిదా, తుల సి, పార్వతి, దొరసాని, నారాయణమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ఆలోచనలకు తగట్టు పని చేయాలి: ఎమెల్యే మద్దిశెట్టి



దర్శి, మేజర్‌న్యూస్: నియోజకవర్గంలోని ప్రజలు ఆలోచనలకూ తగట్టు పనిచేసి వారి అదర అభిమానాలు పొందాలని, వివిధ పనులపై వచ్చే వారిని ఇబ్బంది పెట్టకుండా పని చేయాలని ఎమెల్యే మద్దిశెట్టి వేణు గోపాల్ అధికారులను కోరారు. దర్శిలోని ఎమెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజలు అభివృద్ధికి జగన్ మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఐదు మండలాలకు చెందిన అధికారులతో ఎమెల్యే సమావేశం నిర్వహించారు. ఎన్.ఎస్.పి పూర్ణ చంద్ర రావు మర్యాద పూర్వకంగా ఎమెల్యేని కలసి పుష్ప గుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ న్యాయమైన కోరికలను పరిష్కరించాలి



- ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: అంగన్వాడీ కార్యకర్తల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందని, వారికి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సిపిఎం భట్టిప్రోలు మండల కార్యదర్శి జి సుధాకర్ అన్నారు.అంగన్వాడీల హక్కుల సాధన కోసం అంగన్వాడీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా రెండో రోజైన బుధవారం భట్టిప్రోలు తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు భట్టిప్రోలు మండల కార్యదర్శి జి సుధాకర్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి,ప్రభుత్వ అధికారులకు అనేక సార్లు అంగన్వాడీ కార్యకర్తలు విన్నవించారని,ప్రభుత్వం పరిష్కారం చూపని నేపథ్యంలో నిరవధిక సమ్మెకు దిగారన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని,అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. అంగన్వాడి లబ్ధిదారులకు ఇచ్చేటటువంటి సరుకులు నాణ్యమైనవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలకు రిటైర్ అయిన తర్వాత పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు కూడా వర్తింపజేయాలని కోరారు.అంగన్వాడీ కార్యకర్త భద్రకాళి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు అంగనవాడీలు మా చెల్లెమ్మలు,వారి న్యాయమైన కోరికలు తీరుస్తానని చెప్పి నేడు మాట తప్పారన్నారు.ఈ కార్యక్రమంలో అమృతలూరు సెక్టార్ లీడర్స్ రమాదేవి,సూర్యలక్ష్మి, గృహలక్ష్మి, రూపారాణి,బట్టు నాగమణి తదితరులు పాల్గొన్నారు.వివిధ ప్రజాసంఘాల నాయకులు రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య, యుటిఎఫ్ మండల అధ్యక్షులు సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ,కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శి జి నాగరాజు,చేనేత కార్మిక సంఘం నాయకులు దీపాల సత్యనారాయణ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# గారపెంటలో 30 కుటుంబాలు టీడీపీలో చేరిక



పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: పుల్లలచెరువు మండలంలోని గారపెంట గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సమక్షంలో వైసీపీకి చెందిన 30 కుటుంబాల వారు బుధవారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చంద్రబాబు ప్రభుత్వంలోనే గిరిజనులు అభివృద్ధి చెందారని చెప్పారు. తిరిగి టిడిపి అధికారంలోకి రాగానే గిరిజనాభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయిస్తారని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిపై ఎంతో దూరదృష్టి ఉన్న చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. రానున్న కాలంలో ప్రజల సంక్షేమం కోసం టీడీపీ తొలి మేనిఫెస్టోలో మహాశక్తి, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, అన్నదాత పథకాలతో పాటు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తామని పేర్కొనడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించేదుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, నాయకులు శనగా నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య, ఎర్రగొండపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, కొలుకులూరి కుమార్, మేడికొండ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# సైకో ముఖ్యమంత్రి పోతేనే ఆంధ్ర రాష్ట్రం బాగుపడేది



జగన్ ప్రభుత్వంలో సామాన్యులు బ్రతికే పరిస్థితులు లేవు.

బాబు ష్యూరిటీ,భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కందుల

పొదిలి, మేజర్‌న్యూస్: సైకో ముఖ్యమంత్రి పోతేనే ఆంధ్ర రాష్ట్రం బగువడేదని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తొమ్మిదవ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కందులకు ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. మహిళలు తిలకం దిద్ది హారతులిచ్చారు. నాయకులు కందులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ నంధర్భంగా కందుల మాట్లాడుతూ ఆకాశాన్నంటిన ధరలతో జగన్మోహన్రెడ్డి ప్రభుత్వంలో సామాన్య ప్రజలు బ్రతికే పరిస్థితులు కనిపించడం లేవన్నారు. అన్ని వర్గాల ప్రజలు నుఖ సంతోషాలతో ఉండాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకరావాలన్నారు. తనకు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే వెలుగొండ ప్రాజక్టు నీటిని పొదిలి మండలానికి తీసుకొస్తానని హామీనిచ్చారు. అలాగే పొదిలి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని ఛాలెంజ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కాటూరి పెద్దబాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్,మండల కన్వినర్ మీగడ ఓబులరెడ్డి, పట్టణ కన్వినర్ ముల్లా ఖుద్దూస్,జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్, మాజీ నర్పంచ్ స్వర్ణగీత, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ గౌస్ బాష, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఎస్ఎం బాష, జిల్లా లీగల్సెల్ అధికార ప్రతినిధి షేక్ షబ్బీర్, మాజీ ఏఎంసి ఛైర్మన్ చప్పిడి రామలింగయ్య, మైనార్టీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి షేక్ యాసిన్, మాజీ ఎంపిటిసిలు ఇమాంసాహెబ్, గాలిముట్టి నరసింహారావు, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మహిళా నాయకులు షేక్ షహనాజ్ బేగం, షేక్ మెహరున్నీసాబేగం, మాజీ టిఎన్ఎస్ఎఫ్ నాయకులు షేక్ షబ్బీర్,మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లికార్జున, షేక్ షాహీద్, వీరిశెట్టి సురేష్, మైనార్టీ నాయకులు ఖల్నాయక్, షేక్ మౌలాలి, పంచాయతీ జిలానీ,ముల్లా బుచ్చిబాబు, ముల్లా రబ్బానీ, దివ్వెల మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటూరిని ఘనంగా ఆహ్వానించిన మున్నా



కందుకూరు, మేజర్‌న్యూస్: బాబుషూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 6వ వార్డులో ప్రచారంకు వచ్చిన తెలుగుదేశం పార్టీ కందుకూరు నియోజవకర్గం ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావును ఐటిడిపి కందుకూరు నియోజకవర్గం కో ఆర్డీనేటర్, టిడిపి నాయకుడు షేక్ మున్నా ఘనంగా ఆహ్వానించారు. నాగేశ్వరరావు పూలమాలతో ఆహ్వానం పలికి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో భారీ పార్టీ జెండాలతో, అడుగడుగున నాగేశ్వరరావుపై పూలవర్షం కురిపిస్తూ, బాణాసంచాకాల్చుతూ మున్నా తన అభిమానాన్ని చాటుకున్నారు. వార్డులో ప్రచారం చేస్తూనే ఇంటూరి నాగేశ్వరరావు, టిడిపి ముఖ్యనాయకులు మున్నా ఇంటికి చేరుకొని మున్నా ఏర్పాటుచేసిన తేనీటి విందును సేవించారు. మున్నా కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను నాగేశ్వరరావు తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీలో కమిట్‌మెంట్‌గా పనిచేసే వారిలో మున్నా ఒకరని నాగేశ్వరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వమిత్వా సర్వేలో పురోగతి పెంచాలి : డిపిఓ



కొత్తపట్నం, మేజర్‌న్యూస్: మండలంలోని గుండమాలలో స్వమిత్వా సర్వేలో భాగంగా రికార్డులను పరిశీలించి రోజువారీ పురోగతి ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం గుండు మాల గ్రామంలోని స్వమిత్వ ఆయన పరిశీలించారు. సర్వే ఖచ్చితత్వంతో త్వరితగతిన పూర్తిచేయుటకు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. గ్రౌండ్ ట్రుతింగ్, పూర్తి చేసి, గ్రౌండ్ వాలిడేషన్ దశలో వెక్టరైజేషన్ చేయాలని, యజమానులకు 9(2) నోటీసులు ఇవ్వాలని, ఏదైనా అభ్యంతరాలు ఉంటే వాటిని సరి చేయాలని, 36కాలమ్ వివరాలు, డ్రాఫ్ట్ మ్యాప్ తయారీ ఖచ్చితత్వంతో చేయాలని, అన్ని దశలు సమాంతరంగా చేయగలిగితేనే సర్వే త్వరితగతిన పూర్తి చేయగలమని దిశనిర్దేశం చేయడం జరిగింది. స్వామిత్వ సర్వేలో రోజువారీ పురోగతి ఉండాలని, సదరు నివేదికలు ఎప్పటికప్పుడు జిల్లా పంచాయతీ కార్యాలయానికి అందించాలని, సంబంధిత రిజిస్టర్‌లు అన్ని అప్డేట్ చేసుకోవాలని ఆదేశించారు.

తదనంతరం గ్రామంలో జరుగు సర్వే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి డా. పి.సుజాత, విస్తరణాధికారి బాల చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి, స్వమిత్వా నోడల్ ఆఫీసర్, జిల్లా సర్వేయర్ నాలం వెంకటేశ్వర్లు, సుశాంత్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులే రేపటి పౌరులు

### జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ శాసనసభ్యులు శివప్రసాద్ రెడ్డి



తాళ్లూరు, మేజర్ న్యూస్: మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు 10వ తరగతి 'ఆల్ ఇన్‌వన్ పంపిణి' కార్యక్రమ సమావేశం ప్రధానోపాధ్యాయులు పీ.సుబ్బారావు అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంకు విశిష్ట అతిథులుగా ప్రకాశం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివ ప్రసాదరెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాలలో చదువుచున్న 10వ తరగతి విద్యార్థులకు గత 20 సం.లనుండి ఆల్ ఇన్ వన్ బూచేపల్లి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఇస్తున్నందుకు జడ్పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకి, వారి తనయుడు శివ ప్రసాద్ రెడ్డికి ధన్య వాదాలు తెలిపారు. చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ తన మాతృ పాఠశాలకు ఇప్పటి వరకు ఎన్నో సౌకర్యాలు కల్పించానని, ప్రధానోపాధ్యాయులు అభ్యర్థన మేరకు భోజన హాల్, సైకిల్ షెడ్, సిసి కెమెరాలు, 7 ఐరన్ డోర్స్, మంజూరు చేస్తున్నానని హర్ష ధ్వానాలు మధ్య ప్రకటించారు. 10 వతరగతి పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి ఎప్పటి లాగానే బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను తు.చ తప్పకుండా నేరురుస్తానని తెలిపారు. తదనంతరం ఆల్ ఇన్ ఒన్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ ఆదాం షరీఫ్, సర్పంచ్ మందా శాంసన్, ఉపసర్పంచ్ పులి, ప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ బాలకోటయ్య, నాగంబోట్లపాలెం సర్పంచ్ చిమట సుబ్బారావు, గుజ్జుల తిరుపతి రెడ్డీ, కృష్ణా రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డీ తదితరులు పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే బిజేపి లక్ష్యం

### - కేంద్ర పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి

### - చింతాయగారిపాలెం సభలో బిజేపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ పిలుపు




ఒంగోలు, మేజర్‌న్యూస్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే బిజేపి లక్ష్యమని, కేంద్ర పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బిజేపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ పిలుపునిచ్చారు. వికజిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం ఒంగోలు మండల పరిధిలోని చింతాయగారిపాలెంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్న సభలో పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ వ్యాప్తంగా పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమం, యువత, మహిళా, రైతు సంక్షేమం కోరుచు దాదాపు దేశవ్యాప్తంగా 17 రకాల పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలను ప్రజలు ఉపయోగించు కొనాలని పిలుపునిచ్చారు.ఈ పథకాలు అన్నిటి పైనా మోడీ ఫోటో ఉండాలని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ విధంగా చేయక పోవటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఒంగోలు పార్లమెంట్ కన్వీనర్ సిగ్గెం శ్రీనివాసరావు, కాటా రాధాకృష్ణ మూర్తి, పి. తిరుమల, హరికృష్ణ, మిరియం శ్రీనివాసరావు యాదవ్, భీష్మ, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కాలనీల్లో సమస్యలను పట్టించుకోవడం లేదు

### 60వ రోజు జన చైతన్య యాత్ర బృందం ముందు ఎన్టీఆర్ వాసులు ఆవేదన



ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన జనచైతన్య యాత్ర బుధవారంతో 60వ రోజుకు చేరుకుంది. 9వ డివిజన్‌లో ఇంటింటికి పర్యటించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్యంగా జనసేన పార్టీ జనచైతన్య యాత్ర బృందం ముందు తీసుకొని వచ్చిన సమస్య ఒక్కటే మున్సిపల్ యంత్రాంగం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కాలువల్లో మురుగునీరు నిలిచిపోవడంతో, దోమల స్వైర విహారంతో రోగాల బారిన పడుతున్నామని, రంగు మారిన నీళ్లు తాగలేక నాన ఇబ్బందులు పడుతున్నామని, ఎంతమందికి చెప్పిన పట్టించుకోవటం లేదని జన చైతన్య యాత్ర బృందం ముందు వారి గోడును తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ సంబంధిత అధికారులు దృష్టికి మన ప్రాంత సమస్యలను తీసుకొని పోయి పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కళ్యాణ్ ముత్యాల, ఒంగోలు నగర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పల్ల ప్రమీల, ఒంగోలు నగర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి ఆకుపాటి ఉష, వీర మహిళ మాదాసు సాయి నాయుడు, 28వ డివిజన్ అధ్యక్షులు కోట సుధీర్, జనసేన నాయకులు చెన్ను నరేష్, యాదల సుధీర్, జాన్,రాజా నాయుడు, ఆకాష్, నిఖిల్, యస్వంత్, జాను, ప్రేము, హరి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి బూచేపల్లి ట్రస్టు కృషి

**- 600 మంది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మెటీరియల్ పంపిణీ**



చీమకుర్తి, మేజర్‌న్యూస్: విద్యాభివృద్ధికి బూచేపల్లి ట్రస్టు కృషి చేస్తుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చీమకుర్తి మండలంలోని దేవర పాలెం జిల్లా పరిషత్ హైస్కూల్, పట్టణంలోని బాలికల ప్రభుత్వ హైస్కూల్లో 600 మంది 10వ తరగతి విద్యార్థుళకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి యంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు, గంగిరెడ్డి ఓబులరెడ్డి, సిహెచ్ వెంకటేశ్వర రెడ్డి, క్రిష్టపాటి శేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అన్నాను పరామర్శించిన పిడిసిసి బ్యాంకు చైర్మన్ ప్రసాద్‌రెడ్డి



కనిగిరి, మేజర్‌న్యూస్: ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న గిద్దలూరు శాసనసభ్యులు అన్నా రాంబాబును మార్కాపురంలోని ఆయన నివాస గృహంలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి కలిసి పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకొన్నారు. ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకొని ప్రజాసేవలో కొనసాగాలన్నారు.

## ఘనంగా పోలేమ్మకు వీడ్కోలు



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: కార్తీక మాస పర్వదినాలలో ఉపవాసాలు ఉండి నిత్యం దీపారాధనలు చేసే మహిళలు శుద్ధ పాడ్యమి రోజు పోలమ్మలకు పూజలు చేసి పోలేమను గంగలో వీడ్కోలు పలికారు.నెల రోజులు ఉపవాస దీక్షలు చేసి బుధవారం తెల్లవారుజామున అభ్యంగన స్నానాలు ఆచరించి అరటి దొనెలో దూది వత్తులు పెట్టి, నువ్వుల నూనెతో దీపాలను వెలిగించి కాల్వ ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వెలిగించిన అరటి ధోనిలను కాలువలో సాగనంపారు.ఈ కార్యక్రమం మండల పరిధిలోని పలు గ్రామాలలో నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజ



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన భట్టిప్రోలు లో వేంచేసి ఉన్న శ్రీవేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో బుధవారం మార్గశిర మాస శుద్ధపాడ్యమి సందర్భంగా శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి ప్రతిష్ట వార్షికోత్సవం సందర్భంగా,అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.శ్రీ రాజ్యలక్ష్మి భజన మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బూర్లే అరుణకుమారి, మానేపల్లి ఉమామహేశ్వరి,కోట సంధ్యారాణి,కొల్లూరు అనూష,మానేపల్లి శైలజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఏసిబి వలలో విఆర్వో రవిశంకర్

- ముండ్లమూరు తహసిల్దార్ కార్యాలయంపై దాడులు
- లంచం తీసుకుంటూ పట్టుబడిన విఆర్వో
- మారని రెవిన్యూ అధికారులు పని తీరు
- రెవిన్యూ డివిజన్‌లో కాస్టిలి విలేజ్ పోలవరం





ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలోని నాయుడుపాలెం గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న రావూరి రవిశంకర్ ఇటీవల పోలవరం గ్రామంకు ఇన్చార్జి రెవెన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. పోలవరం గ్రామంలో సర్వేనెంబర్ 738 /1లో 0-66 సెంట్లు, 739/2లో 0-22 సెంట్లు మొత్తం 0-88 సెంట్లును తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ కు చెందిన నారాయణనన్, సత్యవతి, టీ.మనోహర్‌లు ఈ భూమిని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన భూమిపై తమ పేర్లతో పాస్ బుక్ మంజూరు చేయాలని ఈనెల 7వ తేదీ దరఖాస్తు చేసుకోనుగా, గ్రామ రెవెన్యూ అధికారిని కోరగా, 40 వేల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వటం ఇష్టంలేని భూ యజమానులు ఒంగోలు అవినీతి నిరోధకశాఖ అధికారులను ఆశ్రయించారు. బుధవారం తహసిల్దార్ వారి కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారి రవిశంకర్‌కు లంచం ఇస్తుండగా రైతులు వేషంలో ఉన్న అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొనడం జరిగింది. ఈ దాడులలో ఒంగోలు ఎసిబి డిఎస్పి వి. శ్రీనివాసరావు, సిఐలు సిహెచ్ శేషు,అపర్ణ, పీవీ శ్రీనివాసరావు, ఎస్సై నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచాలకు డిమాండ్ చేస్తే 14400కు ఫోన్ చేయాలని ఆయన తెలియజేశారు. పట్టుబడిన రవిశంకర్‌ను నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని తెలియజేశారు.

**మారని రెవిన్యూ అధికారులు పని తీరు**

మండలంలో పనిచేస్తున్న రెవిన్యూ అధికారులు పని తీరు మారటం లేదని ప్రజలు అంటున్నారు. ఏళ్ళ తరబడి మండలంలో పని చేస్తూన్న వీఆర్వోలు చిన్న పనికి కూడా వేల రూపాయలలో వాసులు చేస్తూ ప్రజలు రక్తని జలగలు పీల్చుకు తాగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత 8మంది రెవిన్యూ అధికారులు, ఒక ప్రైవేట్ వ్యక్తి ఎసిబికి పట్టు బడ్డారు అంటే అధికారులు పని తీరు ఏ విధముగా ఉందో ఇట్టే అర్థం అవుతుంది. ఇప్పటి వరకు ఇద్దరు తహసీల్దార్‌లు, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్, నాలుగురు వీఆర్వోలు, ఒక అటెండర్, ప్రైవేట్ వ్యక్తి ఎ.సి.బి. దాడులలో పట్టు బడ్డారు.

**రెవిన్యూ డివిజన్‌లో అతి క్యాస్టలి విలేజ్ పోలవరం.**

మండలంలోని పోలవరం గ్రామ రెవిన్యూ అతి ఖరీదు అయ్యిందిగా పేరు గాంచింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉండగా కందుకూరు రెవిన్యూ డివిజన్‌లో ఉండేది. ప్రస్తుతం ఒంగోలు రెవిన్యూ డివిజన్‌లో ఉన్నాది. ఈ రెవిన్యూలో సుమారు 12వేలు ఎకరాలు భూమి రెవిన్యూ పరిధిలో వుంది. ఆ రెవిన్యూలో కాలేజీ, రాష్ట్రంలోకి అతి పెద్ద పౌల్ట్రీ ఫారంలు, మిల్క్ డైరీలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ గ్రామంలో ఎకరం 5లక్షల నుండి 50లక్షలు వరకు రేట్ పలుకుతు న్నాయి. ఆ రెవిన్యూలో ఎక్కువ భూమి బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులు కొనుగోలు చేశారు. ఆ గ్రామానికి వీఆర్వోగా రావాలంటే రాజకీయ పలుకుబడి దండిగా ఉండాలి. ఈ గ్రామంలో ఎ.సి.బికి పట్టుబడ్డ రవి సోదరుడు వీఆర్వోగా పని చేస్తూ బదిలీపై వెళ్లారు. మూడు నెలలు క్రితమే రవి ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టారు.

# కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు: ఉగ్ర



పామూరు, మేజర్‌న్యూస్: కష్టపడి పని చేసే వారికి తెలుగుదేశం పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని పువ్వాడి రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో టిడిపి నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ టిడిపి, జనసేన నేతలు కలిసికట్టుగా ఉండి రానున్న ఎన్నికలలో ప్రతి బూతులో మెజారిటీ తీసుకువచ్చేందుకు దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో వైసిపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజలు విసుగు చెంది ఉన్నారని ఎన్నికలు ఎప్పుడు వస్తాయి వైసిపిని బంగాళాఖాతంలో కలిపి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకు వద్దామని ఎదురు చూస్తున్నారన్నారు. వైసిపి వైపల్య విధానాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు, జనసేన జిల్లా కార్యదర్శి షేక్ కరీముల్లా, సయ్యద్ అమీర్ బాబు, మార్నేని రామకృష్ణ, యిర్రి కోటిరెడ్డి, పువ్వాడి రామారావు,షేక్ గౌస్ బాషా, గుంటుపల్లి శ్రీనివాసులు, పందిటి హరీష్, మన్నం రమణయ్య, షేక్ సందాని, ఉప్పలపాటి హరిబాబు, తడికమల్ల సుబ్బారావు, దేవరపు మాల్యాద్రి, దయుండే శివశంకర్, దయిండే రామాంజనేయులు, కోటపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

# అగ్రి గోల్డ్ బాధితులను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం



దర్శి, మేజర్‌న్యూస్: ఎన్నికల సమయంలో అగ్రి గోల్డ్ బాధితులు కు వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మోసం చేసారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని దర్శి పట్టణ సిపిఐ పార్టీ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు కోరారు. దర్శి మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో అగ్రిగోల్డ్ నాయకుడు పి.నరసయ్య అధ్యక్షతన అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్ష ను బుధవారం నిర్వహించారు. శిబిరంను ఆయన ప్రారంభించి ప్రసంగిం చారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని, వీరిలో 70 శాతం మందికి పదివేల రూపాయల నగదు, 20వేల రూపాయల లోపు నగదులను ప్రభుత్వము అగ్రిగోల్డ్ బాధితులకు జమ చేయడం జరిగిందని, మరో 30 శాతం మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని విరంతనిరుపేద కుటుంబీకులని వీరికి కూడా అగ్రిగోల్డ్ నిధులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3900 కోట్ల రూపాయలు అగ్రిగోల్డ్ కు ఏజెంట్ల బాధితుల ద్వారా నగదు కట్టించుకోవడం జరిగిందని, అందులో 930 కోట్లు రూపాయలు మాత్రమే అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభు త్వం జమ చేశారుఅని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 82,500 ఎకరాలు ఇళ్ల స్థలాల భూములు,23 వేల ఎకరాల భూము లు అగ్రిగోల్డ్ కింద ఉన్నాయని ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అగ్రిగోల్డ్ బాధితులకు అందించి న్యాయం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ంలో సిహెచ్ ప్రసాదరావు, ఎస్.వెంకటేశ్వర్లు, జే.గురవయ్య, ఏపీసి రావు, ఏ.వీరాంజనేయులు, ఎస్.వెంకటేశ్వర్లు, ఏ.వెంకటరెడ్డి, ఎమ్.రామయ్య, నాసరయ్య తదితరులు పాల్గొన్నా రు.

# విద్యార్థులకు స్వీట్స్, ఫ్రూట్స్, బిస్కెట్స్ పంపిణీ

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని ఆర్యవైశ్య సూరే వంశావళి (ఆధ్యాత్మిక ధార్మిక సామాజిక సేవా సంస్థ) ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల స్కూల్ నందు ఆర్యవైశ్య సూరె వంశావళి ప్రెసిడెంట్ సూరే నాగేశ్వ రరావు టీం, కమిటీ సభ్యులందరి ఆధ్వర్యంలో బుధ వారం పిల్లలకు బిస్కెట్లు స్వీట్స్ పండ్లు పిల్లలకు అందజేశారు. కార్యక్రమానికి ఆర్యవైశ్య సూరే వంశావళి గౌరవ సలహాదారుడు అయినటువంటి సూరే సుబ్రహ్మణ్యం( రిటైర్డ్ బిసి.వెల్ఫేర్ ఆఫీసర్) నూతన కమిటీ తలపెట్టిన సేవా కార్యక్రమానికి ఫస్ట్ ప్రోగ్రాంకు నేను వున్నానని ముందుకు వచ్చి నూతన కమిటీకి ప్రోత్సాహం ఇచ్చినందుకు అలాగనే సొంత ఖర్చులతో ముందుకు వచ్చినందుకు ప్రెసిడెంట్ సూరే నాగేశ్వరరావు టీం కమిటీ సభ్యులు అందరూ వీరికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఇదే విధముగా ఆర్యవైశ్యుల్లో ఎవరైనా సేవా కార్యక్ర మానికి సహకరిస్తే వారి పేరు మీద కూడా మేము సేవ కార్యక్రమం చేస్తాము అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సూరే నాగేశ్వరరావు, కోశాధికారి సురే శ్రీనివాసరావు, ఉప కోశాధికారి సూరే ఆంజనేయులు, ఉపాధ్యక్షులు సూరే శ్రీనివాసులు, కార్యదర్శి సూరే సత్యం, కార్యవర్గ సభ్యుడు సూరే రవిప్రసాద్ పాల్గొన్నారు.

## రేషన్ వాహనంపై మోడీ స్టికర్



దర్శి, మేజర్‌న్యూస్: మండలంలోని వెంకటచలంపల్లి గ్రామంలో రేషన్ ఇచ్చే వాహనంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ స్టిక్కర్ దర్శి బిజెపి నాయకులు అంటించారు. ఈ కార్యక్రమంలో దర్శి అసెంబ్లీ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రం ఇచ్చే ఉచిత రేషన్ బియ్యం ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్టు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అన్ని రేషన్ వాహనాలపై రాష్ట్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ స్టిక్కర్ అంటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, నియోజకవర్గ కో కన్వీనర్ తిండి నారాయణరెడ్డి, యువ నాయకుడు చెరుకూరి అనిల్, పట్టణ ఉపాధ్యక్షుడు అచ్యుత్ శరత్, పట్టణ ప్రధాన కార్యదర్శి కే.శ్రీనివాసులు, వట్టెం కోటేశ్వరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి



దర్శి, మేజర్‌న్యూస్: ద్వి చక్ర వాహనంపై ప్రయాణిస్తూన్న వ్యక్తి అదుపు తప్పి కింద పడి మృతి చెందిన సంఘటన బుధ వారం దర్శి మండలంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్తే మండలంలోని వీరాయపాలెంకు చెందిన తాటికొండ శ్యామ్ సుందర రావు పనిపై దర్శి వెళ్లి తిరిగి తమ గ్రామానికి వచ్చు చుండగా వీరయపాలెం సమీపంలో మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడ్డాడు. స్థానికులు 108కి సమాచారం ఇవ్వటంతో క్షత గాత్రుని దర్శి ప్రభుత్వ వైద్య శాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్టు పైలెట్ నరేష్ బాబు, ఈ.యం.టి గౌస్ బాషా తెలిపారు.

# రెండో రోజు అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ సమ్మె





మార్కాపురం, మేజర్‌న్యూస్: ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, పిల్లలు గర్భిణి బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని, సిబ్బందికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటియుసి, సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె కార్యక్రమం బుధవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డిఓ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం జరిగింది. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒకవైపు చాలీ చాలని వేతనాలతో మరోవైపు రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలతో కొనుగోలు చేయలేక అంగన్వాడి వర్కర్స్ అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వేతనాలు పెంచాలని ఎన్నో సంవత్సరాల నుంచి న్యాయ సమ్మతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. మరోవైపు సుప్రీం కోర్టు ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు ఉండాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వం ఆదేశాలను పెడచెవిన పెట్టిందని విమర్శించారు. అంగన్వాడీ సిబ్బందికి పిఎఫ్, గ్రాడ్యుటి సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అంగన్వాడీ మినీ సెంటర్స్‌ను ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. 2015 సంవత్సరం నుండి అంగన్వాడీ సిబ్బందికి టిఎ బిల్లులు ఇవ్వలేదని, దీంతో వీరంతా అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున ఇప్పటికైనా వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి మృతి చెందిన వారి కుటుంబంలో నుండి మరొకరికి ఉద్యోగ ఉద్యోగవకాశం కల్పించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఐటియుసి సెక్రెటరీ ఎస్.కె కాసిం, సిఐటియు పట్టణ కార్యదర్శి రుబెన్, జిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు టి.రేణుక దేవి, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, సిఐటియు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లలిత కుమారి, కె.ప్రభావతి, ఎం.రమాదేవిలు పాల్గొన్నారు.



## రేషన్ వాహనాలకు ప్రధాని మోడీ స్టిక్కర్లు

మార్కాపురం, మేజర్‌న్యూస్: పట్టణంలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న వాహనాలకు ప్రధాని మోడీ స్టిక్కర్లను బిజెపి నాయకులు బుధవారం అంటించారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ వాహనాలకు ప్రధాని నరేంద్ర మోడీ స్టిక్కర్లను, దుకాణాల వద్ద బోర్డులను ఉంచాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోకపోవడంతో తామే స్టిక్కర్లను అంటిస్తున్నామని మార్కాపురం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి పి.వి.కృష్ణారావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం బొమ్మలు వేసుకుని ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, విశ్వకర్మ యోజన, ఆయుష్మాన్ భారత్ లను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పైడిమర్రి శ్రీనివాసరావు, ఏ.సుబ్బారావు, ఎస్.శివప్రసాద్ రెడ్డి, కె.సుబ్బారెడ్డి, ఎస్.వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శిగా చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి



గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండలంలోని పొదలకొండపల్లె గ్రామానికి చెందిన చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగంలో ప్రకాశం జిల్లా నుంచి శ్రీకాంత్ రెడ్డికి చోటు లభించింది. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుకు శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అనుచరులుగా ఉన్నారు. రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శిగా నియామకం అయ్యేందుకు సహకరించిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఎంతో నమ్మకంతో కీలక పదవిని ఇచ్చిందని పార్టీ బలోపేతానికి , యువజన విభాగం బలోపేతానికి, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపుకు శాయశక్తుల కృషి చేస్తానని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కీలక యువజన నేతగా ఉన్న శ్రీకాంత్ రెడ్డి గిద్దలూరులోని ప్రాచీన శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

## వైభవంగా యాదవ కార్తీక వన భోజనాలు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో యాదవ కార్తీకవన భోజనాలను ఆలయ అధ్యక్షులు ఓ.వెంకటయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్తీక మాసంలో ప్రతిరోజు గంగమ్మ- గౌరమ్మ దేవతలకు పూజలు నిర్వహించారు. బుధవారం పోలీ పాడ్యమి సందర్భంగా పూజలు అందుకున్న గంగమ్మ-గౌరమ్మ దేవతలను దేవస్థానం నుంచి తాళ-మేళాలతో ఊరేగింపుగా కుమ్మరాంకట్ట వరకు యాదవులంత సామూహికంగా వెళ్ళి అక్కడి నుండి ప్రత్యేక వాహనంలో దిగుమట్ట దగ్గర ఉన్న సగిలేరు వాగు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వాగులో గంగమ్మ-గౌరమ్మ దేవతలను నిమర్జనం చేశారు. అనంతరం శ్రీభీమలింగేశ్వరస్వామిని దర్శించుకొని తీర్థ- ప్రసాదాలు స్వీకరించారు. యాదవ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని యాదవ సామాజిక వర్గ అభివృద్ధి గురించి చర్చించారు. తదుపరి యాదవ కార్తిక వన భోజన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో 500మంది యాదవులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బుడత తిమ్మయ్య యాదవ్ హాజరయ్యారు. ఆలయ అధ్యక్షులు ఓ.వెంకటయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి చల్లా రమేష్ యాదవ్, ట్రెజరర్ బాలగురయ్య యాదవ్, గౌరవ సలహాదారులు ఎన్. శ్రీనివాసులు యాదవ్, డాక్టర్ వేణుగోపాల్ యాదవ్, గోపాలకృష్ణ యాదవ్, ఆలయ పాలకమండలి సభ్యులు యల్లయ్య యాదవ్, చల్ల నరసింహులు యాదవ్, జింక వెంకటేశ్వర్లు యాదవ్, దేశబోయిన వెంకట్‌రాజు యాదవ్, యాదవ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్యయాదవ్, ఆవుల రాజు యాదవ్, యాదవ సేవా సమితి అధ్యక్షులు దామెర్ల చంద్రశేఖర్ యాదవ్, గొంగటి శ్రీధర్ యాదవ్, యాదవ జేఏసీ అధ్యక్షులు విజయరామరాజు యాదవ్, రామకృష్ణ యాదవ్, కౌన్సిలర్ చంద్రశేఖర్ యాదవ్, ఓబులేష్ యాదవ్ తదితరులు పాల్గొని యాదవ్ కార్తీక వన భోజన మహోత్సవాన్ని దిగ్విజయం చేశారు.

## మంత్రి సురేష్‌ను కలిసిన బొట్లా రామారావు



మార్కాపురం, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేశ్‌ని కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపి సమన్వయకర్తగా నియమించడంతో ఆయనను వైఎస్సార్‌సీపి బీసీ విభాగం జోనల్ ఇన్చార్జి, ప్రకాశం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ అధ్యక్షులు బొట్లా రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొండపి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితి గురించి చర్చించడం జరిగింది. త్వరలోనే నియోజకవర్గంలోని నాయకులను కలుస్తానని ఈ సందర్భంగా మంత్రి సురేశ్ తెలియజేశారు.

## బిజెపిలోకి చేరిన దిగువమెట్ట గ్రామస్తులు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణ బీజేపీ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో జరిగిన మీటింగ్‌లో గిద్దలూరు మండలం దిగువ మెట్ట గ్రామం ప్రజలు భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరించి ఆన్ లైన్ ద్వారా దగ్గర ఉండి బీజేపీ నాయకులు విశ్వకర్మ కౌసల్య యోజన పథకం బుధవారం రిజిస్ట్రేషన్ చేయించడం జరిగింది. ఈ సమా వేశంలో భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు భవనాసి వెంకటరామాంజ నేయులు, జిల్లాకార్యవర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, పట్టణ బీజేపీ కార్యదర్శి ఎం.వి.రమణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ తీర్థం పుచ్చుకున్న వారు ఆవుల సువర్తమ్మ, ఆవుల సురేష్, పిట్టం రామకృష్ణ రెడ్డి,మేకల ప్రేమ్ కుమార్, పాములేటి సురేష్, పాములేటి సుబ్బమ్మ, గోగు కొండయ్య, శీలం విజయలక్ష్మి, శీలం మహాలక్ష్మి చేరారు.

## ఉంగరాల సుమతి సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ



పొదిలి, మేజర్‌న్యూస్: ఉంగరాల సుమతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పిచ్చిరెడ్డి కాలనీ లోని సుమారు 100 మందికి ఉంగరాల శివ, పావని దంపతుల చేతుల మీదుగా దుప్పట్లు,పండ్లు అందజేశారు. ఈ సంధర్భంగా ఉంగరాల సుమతి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు పిచ్చిరెడ్డి కాలనీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. కార్యక్రమంలో వాటర్ ప్లాంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు దొంతిరెడ్డి సత్యన్నారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కొండలు, కోశాధికారి రావూరి సుబ్బరాయుడు, సభ్యులు ముల్లా యాసిన్,రాఘవేంధ్ర రవి, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## ఇతర రాష్ట్రానికి చెందిన మద్యం పట్టివేత



గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని గిద్దలూరులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురిని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, ఆర్.పి.ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ అరుణకుమారి తెలిపిన వివరాల మేరకు ఈ నెల 12వ తేదీన రాత్రి అమరావతి ఎక్స్ప్రెస్ రైల్లో కర్ణాటక నుంచి గిద్దలూరుకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన 60 (750 ఎంఎల్) మద్యం బాటిల్లను ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నామని అలానే మద్యంతరలించేందుకు సహకరిస్తున్న మరో వ్యక్తికూడా అదుపులోకి తీసుకున్నట్లుగా సీఐ అరుణకుమారి చెప్పారు. అలానే రెండు ద్విచక్ర వాహనాలను మద్యాన్ని సీజ్ చేశామని అదుపులో తీసుకున్న నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ అరుణ్ కుమారి ప్రజలను హెచ్చరించారు.

## బత్తుల వెంకటేష్ యాదవ్ ఇరుముడిలో నాయకులు



పొదిలి, మేజర్‌న్యూస్: రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేష్ యాదవ్ ఇరుముడి కార్యక్రమంలో సామంత పూడి నాగేశ్వర రావు, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మీగడ ఓబులరెడ్డి, షేక్ రసూల్, షేక్ యాసిన్, పెరికే సుఖదేవ్(బూన్), మోరబోయిన బాబురావుయాదవ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. బత్తుల శబరిమల యాత్ర ప్రశాంతంగా జరిగేలా అయ్యప్పస్వామి ఆశీస్సులు అందించాలని ప్రార్థించారు.

## ఎమ్మెల్యే డోలాను మర్యాద పూర్వకంగా కలిసిన పొదిలి నాయకులు



మర్రిపూడి,మేజర్‌న్యూస్: కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామిని బుధవారం మర్రిపూడిలో జరిగిన ఓ కార్యక్రమంలో పొదిలి మండల నాయ కులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఎమ్మెల్యే డోలాను కలిసిన వారిలో మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లికార్జున, మాజీ ఎంపిటిసిగా ముట్టి నరసింహారావు, మైనార్టీ నాయకులు మహమ్మద్, సంద్రపాటి కాలేబుమాదిగ, గంగవరపు నాగులు తదితరులు ఉన్నారు.

## 2వ రోజు అంగన్వాడిల సమ్మె



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: వెలిగండ్ల ప్రాజెక్టు కార్యాలయంలో రెండవ రోజు డిమాండ్స్ మీద కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం రెండవ రోజు చర్చలకు పిలిచి అర్ధాంతరంగా ముగించారనీ ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు బుధవారము దీక్షా శిబిరంలో సోము వెంకట శ్రీలక్ష్మి అన్నారు. ప్రధాన డిమాండ్లు కనీస వేతనం, సుప్రీంకోర్టు చెప్పిన ప్రకారము గ్రాడ్యుయేట్ ఇవ్వాలని యూనియన్ కోరగా అవి రెండు అడుగు వద్దు, మిగతాయి ఆలోచించండి అని చెప్పగా చర్చలు విఫలం అయ్యాయని వారన్నారు. అందుకని రెండో రోజు సమ్మె కొనసాగించడం జరిగింది. ఈ సమ్మె ఎంత వరకు అయినా తీసుకెళ్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు



దొనకొండ, మేజర్‌న్యూస్: ఎన్నికల సమయంలో మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మద్యపాన నిషేధం చేయకుండా కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో వైకాపా ప్రభుత్వం చెలగాటం అడుతుందని టీడీపీ మాజీ లీగల్ సెల్ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు బాబుకోసం భావితరాల భవిష్యత్ కోసం సురేష్ చేపట్టిన సైకిల్ యాత్ర మండలంలోని దొండపాడు అరవల్లిపాడు వద్ధిపాడు సంగాపురం వీరేపల్లి గ్రామాల్లో బుధవారం సాగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తెలుగుదేశంప్రభుత్వంలో చంద్రన్న బీమా పథకం ద్వార ప్రమాదం జరిగిన వెంటనే ఐదు లక్షల ప్రమాద బీమా అందించి పేద ప్రజలను ఆదుకున్న ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, కమ్మ ఆంజనేయులు, తోట కోటేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, మచ్చ సుబ్బయ్య, కొమ్మినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నూతన వధువును ఆశీర్వదించిన కందుల



తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని కేత గుడిపి గ్రామపంచాయతీకి చెందిన వేల్పుల సుబ్బారెడ్డి కుమార్తె వివాహానికి మార్కాపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి హాజరై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కాసేపు ముచ్చటించి, అందరితో ఆనందాన్ని పంచుకున్నాడు. ఈయనతో పాటు టిడిపి మండల కన్వీనర్ ఉడుముల చిన్నపరెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగపు కార్యదర్శి పుచ్చ నూతల గోపీనాథ్ చౌదరి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొంగులేటిని మర్యాద పూర్వకంగా కలిసిన ఏపిఆర్ గ్రూప్స్ అధినేత ఆవుల కృష్ణారెడ్డి



పొదిలి, మేజర్‌న్యూస్: తెలంగాణ రెవిన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఏపిఆర్ గ్రూప్స్ అధినేత ఆవుల కృష్ణారెడ్డి ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంంగా మంత్రి పొంగులేటికి పుష్పగుచ్చం అందించి శుభా కాంక్షలు తెలియజేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన వారిలో రాంప్రసాదొడ్డి, కొండయ్యలు ఉన్నారు.

# సచివాలయ విద్యుత్ ఉద్యోగస్తులు ఎంపీడీవోకు వినతి



గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని గ్రామ వార్డు సచివాలయ విద్యుత్ ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారానికి గిద్దలూరు మండల ఎండిఓ హేమలత దేవికి వినతి పత్రం అందజేశారు. ఎనర్జీ అసిస్టెంట్స్ ( జేఎంఎం గ్రేడ్-2)ల ఆమోద యోగ్యమైన డిమాండ్స్ గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలో ఎనర్జీ అసిస్టెంట్స్ (జేఎల్ఎం గ్రేడ్ -2)లుగా ఉద్యోగులుగా చేరిన మమ్మల్ని జిఎస్ డబ్ల్యూ ఎస్.ఉద్యోగులుగా గుర్తించాలి, ఖచ్చితమైన జాబ్ చార్ట్ రూపొందించాలి, జిఎస్ డబ్ల్యూఎస్ ఉద్యోగుల మాదిరి ఇంక్రిమెంట్, డిఎ అలవెన్సులు ఇవ్వాలి, ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలి, పని వేళలు ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిర్దేశించాలి. పై అంశాలపై గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని ముండ్లపాడు సెక్షన్ నందు పని చేయుచున్న ఎనర్జీ అసిస్టెంట్స్ సిహెచ్ వేంకటేశ్వర రెడీ ఎనర్జీ అసిస్టెంట్ కంచిపల్లే, బి.యోగిరెడ్డి ఎనర్జీ అసిస్టెంట్ కొత్తకోట, సిహెచ్ జాన్ సన్ఎ నర్జీ అసిస్టెంట్ కేఎస్ పల్లె-1, కె.పోలయ్య ఎనర్జీ అసిస్టెంట్ కేఎస్ పల్లె-2, ఎస్.కె.రసూల్ ఎనర్జీ అసిస్టెంట్ అంబవరం, వై.బాలగురయ్య ఎనర్జీ అసిస్టెంట్ వెల్లుపల్లే, జి.రాజేంద్రప్రసాద్ ఎనర్జీ అసిస్టెంట్ కొమ్మునూరు, రమేష్ నాయక్ ఎనర్జీ అసిస్టెంట్ ముండ్లపాడు-2, ఎస్.కె.రషీద్ ఎనర్జీ అసిస్టెంట్ ఎస్సార్‌పేట, ఏ.వెంకటేశ్వర్లు ఎనర్జీ అసిస్టెంట్ గడికోట, డీ.దాసు ఎనర్జీ అసిస్టెంట్ ఉయ్యాలవాడ కలసి గిద్దలూరు మండల పరిషత్ అధికారికి రిప్రజెంటేషన్ ఇచ్చారు.

# గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి : ఎంపీడీవో



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండలంలోని రామగోపాలపురం, ఇమ్మడి చెరువు, పి.రాళ్లపల్లి, మరపగుంట్ల సచివాలయాల పరిధిలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో తాతపూడి సుకుమార్ బుధవారం తెలిపారు. రామ గోపాల్‌పురం గ్రామం సచివాలయంలో ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు బుర్రమధుసూదన్ యాదవ్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంపై మండలంలోని రామగోపాలపురం సచివాలయంలో సచివాలయ సిబ్బంది, సచివాలయ పరిధిలోని నాయకులు, వాలంటీర్స్‌తో ప్రత్యేకసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ తేదీ రామ గోపాలపురం సచివాలయ పరిధిలో జరిగే ఈ కార్యక్రమాన్ని అధికారులు, నాయకులు, వాలంటీర్స్ సమన్వయం చేసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, వైసీపీ నాయకులు వెంకట్రా మయ్య, బొబ్బ వెంకటరెడ్డి, బొబ్బ మహా నంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు, కానీ ఆ గ్రామ సర్పంచ్ ఈ కార్యక్రమానికి గైరాజరయ్యారు.

## మరుగుదొడ్లు శుభ్రం చేసే వాహనం ప్రారంభం



చీమకుర్తి, మేజర్‌న్యూస్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నేషనల్ సఫాయి కర్మచారి పథకం కింద చీమకుర్తి పట్టణం నందు మంజూరు కాబడిన మరుగుదొడ్లను శుభ్రం చేయు సెప్టిక్ ట్యాంక్ ఒక్క వాహనం ఖరీదు రూ.31,67,326 కాగా అందులో రూ.15,06,380లు రాయితీ ఇస్తుండగ మరో 16,60,946 నేషనల్‌సఫారీ కర్మచారి ఫైనాన్షియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రుణం మంజూరు చేశారు. బొంత వెంకటేశ్వర్లు, పాటిబండ్ల ఆదాము గర్నెపూడి రవితేజ, బత్తుల వెంకటేశ్వర్లు, మట్టికుంట రామాంజనేయులుకి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేశారు. చీమకుర్తి మున్సిపాలిటీకి కేటాయించిన వాహనంను మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి చంద్ర ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.వెంకట్ రెడ్డి గారు మరియు కౌన్సిలర్స్ చల్లా అంకుల్, భీమన వెంకట్రావు, పాలపర్తి వెంకట్రావు, మేకల సులోచన యల్లయ్య, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, శానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణ పాల్గొన్నారు.

## కరణం వెంకటేష్‌ను పరామర్శించిన వైకాపా అద్దంకి నూతన ఇన్చార్జ్



అద్దంకి మేజర్‌న్యూస్: చీరాల నియోజకవర్గ వైకాపా ఇంచార్జ్ కరణం వెంకటేష్‌ను అద్దంకి నియోజకవర్గం వైసీపీ నూతన ఇన్చార్జిగా నియమితులైన పాణెం హనిమి రెడ్డి స్థానిక నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. కరణం వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాదులోని ఆయన నివాసంలో బెడ్‌రెస్ట్‌లో ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం అద్దంకి ఇంచార్జ్ హనిమిరెడ్డి స్థానిక నేతలతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా హైదరాబాదులో ఉన్న వైసిపి సీనియర్ నేత వైవి భద్రారెడ్డి, టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డిలను అద్దంకి నియోజకవర్గ ఇన్చార్జ్ అనిమిరెడ్డి స్థానిక నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కోట శ్రీనివాస్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.



## గడప వద్దకే సంక్షేమమే వైకాపా లక్ష్యం

### జెసియస్ కో-ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్

కందుకూరు, మేజర్‌న్యూస్: మేనిఫెస్టో లోని తొంబై తొమ్మిది శాతానికి పైగా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం, మేనిఫెస్టోలో చెప్పినవన్నీ చేశామని ప్రతి ఇంటికి వెళ్ళి ధైర్యంగా చెబుతున్న పార్టీ ఏదైనా వుంటే అది వైయస్సార్ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం అని నిజాయితీగా సంక్షేమాన్ని అందిస్తున్న ఒక నాయకుడిగా జగనన్న నిబద్ధతకు ఇంత కన్నా కొలమానం వుంటుందా అని జె సి యస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్ అన్నారు. స్థానిక ఐ యస్‌రావు నగర్ సచివాలయం వద్ద జరిగిన ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ జగనన్న అన్ని రంగాలలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న తీరు ప్రశంసనీయం అని అన్నారు. పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ప్రతి ఒక్కరి గడప వద్దకే సంక్షేమం తెచ్చిన మహనీయుడు జగన్మోహన్ రెడ్డి కందుకూరు పట్టణంలో శాసనసభ్యులు మానుగుంట మహిధరరెడ్డి నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు ద్వారా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారు అని అన్నారు. అవినీతికి తావు లేకుండా డిబిటి నాన్ డిబిటి నాడు నేడు రోడ్లు డ్రైనేజీ కాలువలు నిర్మాణానికి నిధులు మంజూరుచేసి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి కాబట్టి 2024లో జగన్మోహన్ రెడ్డి మహిధర్ రెడ్డి నాయకత్వంను బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనార్ధన స్వామి ఆలయం ఛైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ రాష్ట్ర నేతలు గణేషం గంగిరెడ్డి, పాశం కొండయ్య ,జాజుల లావణ్య ,షేక్ పకృద్దీన్ ఆలీ అహ్మద్, షేక్ హమీద్, షేక్ రహీం, షేక్ రిజ్వాన్, కందుకూరి శ్రీనివాస దీక్షితులు, మల్లిబోయిన శివకృష్ణ యాదవ్, బిరుదులు సంధ్యారాణి, చదలవాడ కామాక్షి, డి.ఆదిలక్ష్మి,తలపనేని గోపి, షేక్ మస్తాన్ వలీ ,జిల్లెళ్ళమూడి కోటేశ్వరరావు, జాజుల లింగయ్య, ఆలూరి సుందరరావు కన్వీనర్లు బక్కమంతుల అశోక్, జాజుల సాయిలక్ష్మి, ఏకాంబరం విశ్వనాథ్, ఏకాంబరం ప్రభాకర్, వాకారాజారెడ్డి, కూరపాటి వెంక ట్రామిరెడ్డి, గోకరాజు రామకృష్ణ, కాకు అంజి, రాయళ్ళ సాయికుమార్, జాజుల ప్రభాకర్, గోదూరి నాగలక్ష్మి, జాజుల రజనీ, ఇనగంటి ప్రకాశం, గొర్రె కిరణ్ పాల్గొన్నారు




# రెండోవ రోజు అంగన్వాడీల సమ్మె

గిద్దలూరు, మేజర్‌న్యూస్: అంగన్వాడి కార్యకర్తల సమస్యలు పరిష్కారం చేయాలని బుధవరాం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ నిర్వర్తిక సమ్మె చేపట్టారు. ఈ సమ్మెలో భాగంగా గిద్దలూరు ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల అంగన్వాడి కార్యకర్తలు గిద్దలూరు గిద్దలూరు తాసిల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా చేయడం జరిగింది. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు ప్రకారం ప్రతిఅంగన్వాడీ కార్యకర్తకు గ్రాడ్యుటి అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తించాలని, అర్హత ఉన్న అంగన్వాడీ టీచర్లకు సూపర్వైజర్ పోస్టులు ఇవ్వాలని, ప్రతి అంగన్వాడీ కార్యకర్తకు బీమా సౌకర్యం కల్పించాలని, డ్యూటీ చేస్తూ చని పోయిన అంగన్వాడీ కార్యకర్తకు వారి కుటుం బంలో ఒకరికి ఉద్యోగం చూపించాలని, ఎఫ్. ఆర్.ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, ఐసిడిఎస్‌కు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడి సమస్యలు పరిష్కారం చేసి సమ్మెను విరమింప చేయాలని లేకుంటే సమ్మెను కొనసాగిస్తామని అన్నారు. మద్దతు పలికిన వివిధ కార్మిక సంఘాలు అంగన్వాడీ ఇలా సమ్మెకు సిఐటియు మండల అధ్యక్షురాలు మెప్మా ఆర్పి యూని యన్ అధ్యక్షురాలు జి.పద్మావతి షేక్ ఫాతిమా బి.రూతమ్మ ఆశవర్కర్స్ యూనియన్ నాయ కులు విశ్రాంతమ్మ కళ్యాణి ఎం.సరోజినీ, అంగన్వాడి సమ్మెకు మద్దతు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.థామస్, బి.నరసింహులు, జి.ఆనందరావు, అంగన్వాడి యూనియన్ నాయకులు ఏమున్నా విజయలక్ష్మి, వరలక్ష్మి, రవణమ్మ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరులో...**

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ కందుకూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి కందుకూరు అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు ఆర్ సరస్వతి ప్రభావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు యుటిఎఫ్ నాయకత్వం సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ రాష్ట్ర నాయకులు ఏ అనురాధ సిఐటియు కందుకూరు ప్రాజెక్టు గౌరవాధ్యక్షులు గౌస్ సిఐటియు పట్టణ అధ్యక్షులు డి రామ్మూర్తి కందుకూరు పట్టణ అంగన్వాడీలు అనూష దివ్యశ్రీ ప్రాజెక్టు కార్యదర్శి ఎస్.కె రహమతున్నిసా వివి పాలెం మండల నాయకులు ఎం జయలక్ష్మి ఏ అరుణ పి భారతి ఎస్ సంపూర్ణ జ్యోతి అనురాధ రాధ మల్లిక చెంచులక్ష్మి హెల్పర్లు దివ్యభారతి సుభాషిని మస్తానమ్మ శశి కేశవ కుమారి తదితరులు పాల్గొన్నారు

# అద్దంకిలో వైకాపా జెండా ఎగరవేయటమే అజెండా



## కార్యకర్తల సమావేశంలో నూతన ఇంచార్జ్ సోదరులు

అద్దంకి, మేజర్‌న్యూస్: అద్దంకిలో వైకాపా జెండా ఎగరవేయటమే తమ అజెండా అని అద్దంకి నియోజకవర్గ నూతన ఇంచార్జ్ పాణెం హనిమిరెడ్డి సోదరుడు నరసింహారెడ్డి అన్నారు. అద్దంకి నియోజకవర్గ వైసిపి నూతన ఇన్చార్జిగా హనిమిరెడ్డి నియమితులైన నేపథ్యంలో ఆయన సోదరులు నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి ఇరువురు బుధవారం ఉదయం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా వద్ద కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పాణెం హనిమిరెడ్డిని అద్దంకి ఇన్చార్జిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియమించడం జరిగిందన్నారు. టిటిడి మాజీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, బాచిన చెంచు గరటయ్య, కరణం బలరామకృష్ణమూర్తి ఆశీస్సులు, ఇప్పటివరకు అద్దంకి ఇన్చార్జిగా పనిచేసిన శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య సహకారాలు ఉంటాయని, కార్యకర్తలు అందరూ సమిష్టిగా పనిచేసి వైకాపా జెండాను ఎగరవేయాల న్నారు. హనిమిరెడ్డి సోదరులు నరసింహారెడ్డి మాట్లాడుతూ త్వరలో ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టేందుకు హనీమిరెడ్డి అద్దంకి రానున్న నేపథ్యంలో స్థానిక నాయకులు కార్యకర్తలతో సమావేశమై ముందస్తు ఏర్పాట్లను పరిశీలించేందుకు అద్దంకి వచ్చామన్నారు. ఇంచార్జ్ అద్దంకి వచ్చిన తర్వాత గ్రామస్థాయి నుండి ప్రతి కార్యకర్తను కలవడం జరుగుతుందని అన్నారు. ఇప్పటినుండి స్థానికంగా ఉండి ప్రతి కార్యకర్తకి అందుబాటులో ఉంటామని నియోజకవర్గ అభివృద్ధికి అందరి తోడ్పాటు కావాలన్నారు. అందరూ కలసికట్టుగా పనిచేసి అద్దంకిలో హనిమి రెడ్డిని గెలిపించాలని, వైకాపా జెండా ఎగరవేయాలని ఆయన కోరారు. సమావేశంలో అద్దంకి పట్టణంతోపాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే మానుగుంట ఆదినారాయణరెడ్డి వర్ధంతి



కందుకూరు, మేజర్‌న్యూస్: కందుకూరు విధానసభ మాజీసభ్యులు దివంగత మానుగుంట ఆదినారాయణరెడ్డి వర్ధంతి కార్యక్రమం బుధవారం ఆయన స్వగ్రామం మాచవరంలో వేలాదిమంది అభిమానుల మధ్య ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో ఆయన తనయులు ప్రస్తుత ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఆదినారాయణరెడ్డి విగ్రహానికి గజ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన వేలాదిమంది మానుగుంట అభిమానులు ఆది నారాయణ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.

**మీ ఆదరాభిమానాలకు ధన్యవాదాలు...**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ మానుగుంట కుటుంబంపై నియోజకవర్గ ప్రజలు విశేషమైన ఆదరాభిమానాలను చూపుతున్నందుకు తమ కుటుంబ సభ్యులందరు ధన్యవాదములు తెల్పుతున్నారని అన్నారు. అభిమానులు తమ స్వగ్రామానికి విచ్చేసి తన తండ్రి విగ్రహానికి అవ్యాజ్యమైన ప్రేమతో, నివాళులర్పించడం నిజంగా మా తండ్రి యొక్క కార్యదక్షతకు, ప్రేమాభిమానాలకు ఇది నిదర్శనమని అన్నారు. నివాళులు అర్పించిన తమ కుటుంబ శ్రేయోభిలాషులకు, ఆత్మీయులకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## మహిళల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం

### ముస్లిం జాగరణ్‌మంచ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ హుస్సేన్‌బి



ఒంగోలు, మేజర్‌న్యూస్: మహిళల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తానని ముస్లిం జాగరణ్ మంచ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ హుస్సేన్ బి అన్నారు. బుధవారం పత్రికా ప్రకటన ద్వారా పలు విషయాలు మాట్లాడారు. ఇటీవల పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడిన యువకులు, పెద్దలు, మహిళలపై దాడులు ఎక్కువగా చేస్తున్నారని, అభం శుభం తెలియని పసి పిల్లలపై కూడా కన్న తండ్రి లాంటి కామాందులు అత్యాచారాలు జరుపుతున్నారని సమాజంలో మహిళలు అంటనే చులకన భావం ఏర్పడినదన్నారు. ప్రేమ పేరుతో వంచించడం, పెళ్ళి విషయానికి వచ్చేటప్పటికి మాట తప్పడం, ఇలా అన్ని విధాలుగా అత్యాచారాలకు గురైన మహిళలు నేడు సమాజంలో కోకొల్లలుగా వున్నారని ఆమె పేర్కొన్నారు. దీనికంతటికి కారణం పాశ్చాత్య సంస్కృతే కారణమని అన్నారు. మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా తాను ముందుంటానని, వారి సమస్యల పరిష్కారం కోసం ఎంతవరకైనా పోరాటం కొనసాగిస్తానని ఆమె తెలిపారు. అన్యాయాలకు, అత్యాచారాలకు గురైన బాధిత మహిళల పట్ల సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా చూడాలని అధికారులను కోరారు. అన్యాయాలకు గురైన బాధిత మహిళలు తన సెల్ నెం 8885285574 ద్వారా సంప్రదించాలని ఆమె కోరారు.

## 15న అంబేద్కర్ భవన్‌లో ఎంఆర్‌పిఎస్ సమావేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలు అంబేద్కర్ భవనంలో జిల్లా సమావేశం జరిగింది. ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు తొరటి ఆనంద్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశంలోని ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి, మాదిగ, ఉప, కులాలకు బిజెపి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీ ఎస్ ఎంఎస్పి, అనుబంధ సంఘాల నిర్మాణం చేపట్టడానికి నాయకులు, కార్యకర్తలు, సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15వ తేదీ శుక్రవారం ఒంగోలు అంబేద్కర్ భవనంలో మధ్యాహ్నం రెండు గంటలకు జిల్లా కమిటీల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, ఈకార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జాతి అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలియజేశారు. నియోజకవర్గ ఇన్చార్జి 50 మంది తగ్గకుండా తీసుకుని రావాలని ఆనంద్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి బాపట్ల జిల్లా కన్వీనర్ బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నర్సింగ్ రావు మాదిగ, ఎంఎస్పి సీనియర్ నాయకులు వర్ల దేవదాసు మాదిగ, ఎంఎస్పీ జిల్లా నాయకులు పూనూర్ కృష్ణాపర్ మాదిగ, బాపట్ల జిల్లా ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ వందనం మాదిగ, ఎంఎస్పి కనిగిరి ఇంచార్జ్ రావినూతల కోటయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ కొండేపి నియోజకవర్గం సుదర్శన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎండ్లూరి రాజారావు మాదిగ, రాజు మాదిగ మెత్తల అభిషేక్ మాదిగ, డేవిడ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## సజ్జలను కలిసిన రాయిపాటి జగదీష్

ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లాలో ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జన రామకృష్ణారెడ్డిను విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ కోరారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో సజ్జలను మర్యాదపూర్వకంగా కలిశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జిల్లా అధ్యక్షులు కార్తీక్, నగర అధ్యక్షులు కరుణాకర్, జిల్లా ఉపాధ్యక్షులు సూర్య ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకృష్ణ సతీష్, నాగార్జున యూనివర్సిటీ నాయకులు శాస్త్రి శ్యాము, తదితరులు పాల్గొన్నారు.

## జనాభా దామాషా ప్రకారం మాదిగలకు సీట్లు కేటాయించాలి

### సజ్జలను కోరిన సుజన్ మాదిగ

ఒంగోలు, మేజర్‌న్యూస్: 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం, మాదిగలకు సీట్లు కేటాయించాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిలో వైయస్సార్ పార్టీ రాష్ట్ర రాజకీయ సలహాదారులు సజ్జల రామ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో 29 రిజర్వుడు స్థానాలు ఉంటే కేవలం ఏడుగురు మాత్రమే మాదిగలకు కేటాయించారని, ఆ విధంగా కాకుండా సామాజిక న్యాయ సూత్ర ప్రకారం, జనాభా ధామాషా ప్రకారం, 29స్థానాల్లో మాదిగ జనాభా ఎక్కువ ఉన్న ప్రాంతంలో మాదిగలకు సీట్లు కేటాయించాలన్నారు. అదే విధంగా మీ పార్టీ సామాజిక సాధికారత పేరుతో ఒక సిద్ధాంతంతో తిరుగుతున్న మీరు, తప్పనిసరిగా సామాజిక న్యాయం పాటించాలని, జనాభా ధామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని, సుజన్ మాదిగ సజ్జలతో అన్నారు. ఈ సందర్భంగా సజ్జల సుజన్ మాదిగతో మాట్లాడుతూ తప్పనిసరిగా మీ విజ్ఞప్తిని, పరిశీలనలోకి తీసుకొని, తప్పని సరిగా జనాభా ధామాషా ప్రకారం సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### – సజ్జలను కోరిన వినుకొండ రాజారావు



ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించా లని రాష్ట్ర సలహాదారు సజ్జల రామ కృష్ణారెడ్డిని రాష్ట్ర ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజా రావు కోరారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగులు సమస్యలను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఉద్యోగులతో సత్సంబంధాలు కలిగి స్నేహపూర్వ వాతావరణంలో ఉంటూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి, ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్లు ప్రకారం అనేక కష్టనష్టాలకు ఓర్చి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, అలాగే వివిధ డిపార్ట్మెంట్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సజ్జలను కోరిన రాజారావుతో పాటు ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా కాకాని అశోక్ జన్మదిన వేడుకలు





అద్దంకి మేజర్‌న్యూస్: తెలుగు దేశం పార్టీ అద్దంకి పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ కాకాని అశోక్ జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి కాకాని పాలెం మండపం వద్ద ఘనంగా నిర్వహించారు. పట్టణ తెలుగు యువత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో ముందుగా భారీకేకును ఏర్పా టుచేసి కట్ చేశారు. ఈ కార్యక్ర మంలో పట్టణంలోని వివిధ ప్రాంతాలతో పాటు మండల పరిధిలోని పలువురు నాయకు లు, కార్యకర్తలు మహిళలు చిన్నారులు భారీగా హాజరై అశోక్‌కు జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. మరికొందరు ఫోన్ల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, కుందారపు రామారావు, భోజన పల్లి సత్యనారాయణ, రామిశెట్టి రవి, రంగిశెట్టి సాంబశివరావు (లహరి), బచ్చల వాసు, యర్రాకుల రామాంజనేయులు, కాకాని అమృత లక్ష్మి ఉన్నారు.

# మా మద్దతు ఇంటూరి నాగేశ్వరరావుకే





**6వవార్డులో ఇంటూరి నాగేశ్వరరావు పర్యటన**

**అండగా ఉంటాం.. గెలిపించుకుంటాం**

**కందుకూరు 6వ వార్డులో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం**

**ఇంటూరి నాగేశ్వరరావుకు బ్రహ్మరథం పట్టిన ముస్లింలు**

కందుకూరు, మేజర్‌న్యూస్: కందుకూరు పట్టణం లోని 6వ వార్డు కోటకట్ట మసీదు ప్రాంతంలో, బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని కందుకూరు నియోజకవర్గ తెలుగు దేశంపార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం ఉదయం నిర్వహించారు. ముందుగా ఆ ప్రాంతంలోని ముస్లింలంతా, పెద్దఎత్తున తరలివచ్చి నాగేశ్వరరావుకు ఘనస్వాగతం పలి కారు. నాగేశ్వరరావు పై పూలు చల్లుతూ అభిమానంతో ముంచేత్తారు. గతంలో ఎప్పుడూ గడపదాటని ముస్లిం మహిళలు కూడా నాగేశ్వ రరావును ప్రతి ఇంటికి తీసుకువెళ్లి, ఆయనను అందరికీ పరిచయం చేస్తూ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా మహిళ లంతా జగన్ ప్రభుత్వంపై, స్థానిక వైసీపీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కొంతమంది అధికార పార్టీ నేతలు తమకు ప్రభుత్వ పథకాలు అందకుండా అడ్డు పడుతున్నారని, నోరు తెరిచి అడిగితే బెదిరిస్తున్నారని నాగేశ్వరరావుతో చెప్పారు. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమానికి వెళ్ళకూడ దంటూ మూడు రోజులుగా తమపై వైసీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారని మహిళలు తెలిపారు. ఒకవేళ కార్యక్ర మానికి వెళితే ప్రభుత్వ పథకాలు కట్ చేస్తామని ఉదయం కూడా తమను బెది రించారని చెప్పారు. ఈసారి వైసీపీకి ఓటు వేసే ప్రసక్తే లేదని, ఇంటూరి నాగేశ్వ రరావుకి మద్దతుగా నిలిచి, ఆయన్ను అధిక మెజారిటీతో గెలిపించుకుంటా మని స్పష్టం చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో పేద లందరికీ స్థలాలు కేటాయించి, ఇల్లు కట్టించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఎలాంటి బెదిరింపులు వచ్చినా తమకు తెలియ జేయాలని తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ బాషా, వార్డు నాయకులు షేక్ ఫిరోజ్, షేక్ మున్నా, షేక్ మియాజాన్, షేక్ దావూద్ బాషా, షేక్ నాయబ్ రసూల్, సయ్యద్ అహ్మద్, షేక్ రియాజ్, షేక్ సలీం, షేక్ అబ్దుల్లా, షేక్ సంధాని, షేక్ జిలాని, షేక్ సుభాని, షేక్ నిషాహీద్ నాయకులు కంద్రా మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, వడ్డెళ్ల రవిచంద్ర, బెజవాడ ప్రసాద్, గోచిపాతల మోషే, రాయపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు మాల్యాద్రి, పొడపాటి మహేష్, చుండూరి శీను, షేక్ సలాం, సయ్యద్ జియావుద్దీన్, రూబీ, గౌస్ బాషా, కరిముల్లా,షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వానికి నూకలు చెల్లాయి

- గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల
- పసుపు సైనికులతో దద్దరిల్లిన కొమరోలు
- వేలాదిమంది కార్యకర్తలతో భారీ ర్యాలీ

గిద్దలూరు, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో దుర్మార్గపు పాలన చేస్తున్న జగన్ రెడ్డి ప్రభుత్వానికి నూకలు చెల్లాయని గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తు ముల అశోక్ రెడ్డి వైసీపీ ప్రభుత్వంపై ధ్వజ మెత్తారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా జనసేన ఇంచార్జ్ బెల్లంకొండ సాయిబాబుతో కలిసి కొమరోలు పట్టణంలోని సాయిబాబా ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేలాది మంది టీడీపీ జనసేన కార్యకర్తలతో కలిసి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన జగన్ రెడ్డి బటన్ నొక్కుడు తప్ప రాష్ట్రంలో సంక్షేమం లేదన్నారు. నాడు తెలుగుదేశం హయాంలో నియోజక వర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని, కొమరోలు మండలంలో బీసీ భవనం, మినీ స్టేడియం,



నిర్మాణాలకు నిధులు మంజూరు చేశానని, గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, త్రాగునీటి సమస్య పరిష్కరించానని, అదే విధంగా ముస్లిం మైనార్టీల కు దులహన్ పథకం, సబ్సిడీ రుణాలు, అన్నీ వర్గాలకు న్యాయం చేశానాని మీకు ఏ కష్టం వచ్చిన మీకు అండగా ఉంటానని, రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని తెలుగుదేశం జనసేన లకు మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమరోలు మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బిజ్జాల తిరుమల రెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి వీరంరెడ్డి రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ ముత్తుముల సంజీవరెడ్డి, గిద్దలూరు జడ్పిటీసి సభ్యులు బుడతా మధుసూదన్ యాదవ్, కొమరోలు తెలుగుయువత అధ్యక్షులు షేక్ నభి, మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ ఖాదర్, మాజీ ఎంపీటీసీ గోడి ఓబుల్ రెడ్డి, జనసేన కొమరోలు మండల పార్టీ అధ్యక్షులు గజ్జలకొండ నారాయణ, మండల రైతు అధ్యక్షులు బద్రి లక్ష్మీ రంగారెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బిజ్జం రవీంద్రారెడ్డి, మండల టిడిపి నాయకులు నియోజకవర్గంలోని బీసీ నాయకులు, మైనార్టీ నాయకులు, ఎస్సి నాయకులు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## జిజిహెచ్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: మానవ సేవే మాధవ సేవ అని, రోగుల పని పట్ల అంకితభావం, సాటి వారి పట్ల ప్రేమ అనురాగాలు చూపించడమే క్రీస్తు మార్గం అని, ఆ మార్గంలో వైద్య సేవలు అందించాలని ప్రముఖ వైద్యులు, మాజీ రిమ్స్ సూపరిండెంట్ డా. రాజేశ్వరరావు పిలుపు నిచ్చారు. జిజిహెచ్‌లో నర్సింగ్ సిబ్బంది ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భగా జిజిహెచ్ లో ఏర్పాటు చేసిన ప్రతేక ప్రార్థన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిమ్స్ ఏర్పా3టు లోయ్ తన తొత్పాటు, పని చేసిన అనుభవంను ఆయన పంచుకున్నారు.జిజిహెచ్ డెప్యూటీ సూపరిండెంట్ డా. ప్రభాకరరావు మాట్లాడుతూ అందరూ మంచి జీవన విధానంతో ఆనందంగా గడపాలని, దేవుని సేవ ఎంతో గొప్పదని ఆయన అన్నారు. ఆర్ఎంవో డా బి. తిరుమల రావు మాట్లాడుతూ సెమీ క్రిస్మస్ వేడుకలు చేసుకోవడం మంచి పరిణా మమని, పేదలకు సేవ చెయ్యడం ద్వారా మీరు మరింత ఆనందాన్ని పొందుతారన్నారు. ఏఆర్ఎంవో డా. అనిల్, డా. జయశ్రీ, డా అచ్చం నాయడు, నర్సింగ్ సూపరిండెంట్ సంపూర్ణమ, నర్సింగ్ ప్రిన్సిపాల్, నర్సింగ్ సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం డా. రాజేశ్వరరావును సిబ్బంది, వైద్యులు ఘనంగా సన్మానించారు.

# కష్టపడి చదివి గొప్పస్థాయికి వెళ్లాలి

**బాలికల ఆనంద నిలయం వసతి గృహాన్ని సందర్శించిన సాంఘిక సంక్షేమ శాఖ డైరేక్టర్ విజయకృష్ణన్**



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఒంగోలు పట్టణంలో సాంఘిక సంక్షేమ బాలికల ఆనంద నిలయం వసతి గృహంను సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు విజయ కృష్ణన్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని ప్రతి విద్యార్థినీతో ముఖాముఖి మాట్లాడారు. వారి లక్ష్యమేంటో, వారు జీవితంలో ఏమి కావాలో అని ప్రశ్నలు అడిగి వారి వద్ద జవాబులు రాబట్టారు. అలాగే, విద్యార్థినీల ఆరోగ్యం గురించి, మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. బదులుగా విద్యార్థినీలు వారి ఆరోగ్యం బాగుందని, మెనూ చాలా బాగుందని, వారి వసతి గృహ సంక్షేమాధికారి కూడా చాలా బాగా చూసుకుంటున్నారని తెలిపారు. అలాగే, విద్యార్థినీలు అందరూ ఉన్నతమైన చదువులు చదివి, గొప్ప స్థాయిలో ఉండాలని ఆదేశించారు. తదనంతరం, వసతి గృహ నిర్వహణ పట్ల సంతృప్తి చెందుతూ, వసతి గృహ సంక్షేమాధికారిని కూడా సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇలాగే నిర్వహించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటి డైరెక్టర్, సాంఘిక సంక్షేమశాఖ యన్. లక్ష్మానాయక్, సహాయ సాంఘిక అధికారి యం. ఉదయశ్రీ, వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు డి. అంకబాబు, వసతి గృహ సంక్షేమధికారి డి. దుర్గాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## జనసేనలో చేరనున్న గరికపాటి వెంకట్

**దర్శి జనసేన ఇన్‌ఛార్జిగా నియమించే అవకాశం**

( సూర్య ప్రతినిధి,ఒంగోలు)



ప్రవాస భారతీయుడు గరికపాటి వెంకట్ జనసేన పార్టీలో చేరనున్నారు. గురువారం జనసేనపార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ సమక్షంలో వెంకట్ పార్టీలో చేస్తున్నారు. జనసేన, తెలుగుదేశం పార్టీ లు త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులతో ముందుకెళ్తున్న తరుణంలో దర్శి నియోజకవర్గాన్ని జనసేనకు కేటా యించనున్నారు. ప్రస్తుతం గరికపాటి వెంకట్ జనసేనలో చేరిన వెంటనే ఆయనను దర్శి జనసేన ఇన్చార్జిగా నియమించేందుకు రంగం సిద్ధమైంది.

## మామిడి పంటపై రైతులకు అవగాహన



ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని చాకిచర్ల రైతు భరోసా కేంద్రం నందు ఉద్యానవన శాఖ అధికారి బి.జ్యోతి మామిడి పంటలు డిసెంబర్ నెలలో పూత దశలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ పూత మొదలైన సమయంలో మొగ్గ దశ, పూత దశ, నల్లపూస దశ, గోలికాయ దశలో తేనె మంచు పురుగు నివారణ, మసితెగులు గురించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన నిర్వహించారు. ఏయే దశలో ఏఏ మందులు వాడాలో ఆమె రైతులకు వివరించారు.

## జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం: ఎమెల్యే మద్దిశెట్టి



దర్శి, మేజర్‌న్యూస్: జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అని, ఆ దిశగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాడని ఎమెల్యే మద్దిశెట్టి వేణు గోపాల్ అన్నారు. మండలంలోని రామ చంద్రపురంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫ్లెక్సీని ఎమెల్యే ఆవిష్కరణ చేశారు. ముండ్లమూరు మండలంకు చెందిన బచ్చు నారాయణ రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయినా ఒక లక్ష ముప్పాయి వేలు రూపాయలు చెక్కును ఎమెల్యే అంద చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రతిభ కనపరచాలి

- చైర్‌పర్సన్ వెంకాయమ్మ



దర్శి, మేజర్‌న్యూస్: పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనపరచి పాఠశాలతోపాటు, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. దర్శి పట్టణం లోని అద్దంకి రోడ్డు లో గల అంబేద్కర్ గురుకుల పాఠశాల లో 10వ తరగతి విద్యార్థులు కు అల్ ఇన్ వన్ మెటీరియల్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ తల్లిదండ్రులు కన్న కలలు సాకారం చేసేందుకు ప్రతి ఒక్క విద్యార్థి కృషి చేయాలని కోరారు. మాజీ ఎమెల్యే శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతు విద్యార్థులకు పదవ తరగతి అనేది ఒక టర్నింగ్ పాయింట్ అని, విద్యార్థులందరు ఇష్టంతో చదివి నూటికి నూరు శాతం ఉతిర్ణత సాధించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాకు పెద్ద పీట వేసిందని, ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను విద్యార్థులు వినియోగించుకోవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడే పామూరులో
## ఉగ్ర క్యాంప్ కార్యాలయ ప్రారంభోత్సవం

పామూరు, మేజర్‌న్యూస్: రానున్న ఎన్నికలలో కనిగిరి నియోజకవర్గం నుంచి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయుచున్న మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరహారెడ్డి తన క్యాంపు కార్యాలయాన్ని పామూరు పట్టణం లో ఏర్పాటు చేయనున్నారు. నేడు డాక్టర్ ఉగ్ర చేతుల మీదుగా క్యాంపు కార్యాల యాన్ని ప్రారంభించడం జరుగుతుంది. ఇప్పటివరకు టిడిపి శ్రేణులును డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పామూరు వచ్చినప్పుడు సరైన రీతిలో కలవలేకపోతున్న లోటును తీర్చేందుకు క్యాంపు కార్యాలయ ప్రారంభం ఎంతగానో ఉపయోగపడు తుందని టిడిపి శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

# మురికి కుంటలా సి.ఎస్.పురం బస్టాండ్

- పట్టించుకోని ఆర్టీసి అధికారులు, ప్రజాప్రతినిధులు
- పందులు, గేదెలతో ఆవరణం బురదమయం



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ కార్యక్ర మంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుని పట్టణాల ను గ్రామాలను ప్రభుత్వ కార్యాల యాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివిధ రకాలుగా ప్రచారం నిర్వహిస్తుంటే రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసి) అధి కారులు ఇవేమీ మాకుపట్టవంటూ స్థాని క బస్టాండ్ మురికికుంటలా తయారై పందులు గేదెలు తొక్కుతూ బురదమయంగా ఉండి దుర్వాసన వెదజల్లుతూ ప్రయాణికులు ప్రజలు తీవ్ర ఇబ్బందు లు పడుతున్నారని తక్షణమే ఆర్టీసి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు బస్టాండ్ ఆవరణను పరిశుభ్రం చేయించి కాంక్రీట్ వేయించాలని అదేవిధంగా చుట్టూ ప్రహరీ నిర్మించా లని ప్రజలు కోరుతున్నారు. మురికి కూపం బురదమయం కావడంతో బస్సులను కూడా బస్టాండులో దుర్వాసనకు నిలపలేక దూరంగా నిలుపుతున్నారని ప్రజలు ప్రయాణికులు విద్యార్థులు స్థానికుల ఇబ్బం దులను గమనించి అధికారులు ప్రజా ప్రతినిధులు తగిన చర్యలు తీసుకో వాలని పలువురు కోరుతున్నారు.

# నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుంది



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రేపల్లె వ్యవసాయ శాఖ ఏ డి ఏ సయ్యద్ హక్తర్ హుస్సేన్ అన్నారు. బుధవారం సాయంత్రం నీట మునిగిన వరి పైరును పరిశీలించేందు కు కేంద్ర బృందం వస్తుందని జిల్లా ఉన్నతాధికారులు తెలియపరచడంతో వ్యవసాయ శాఖ మరియు రెవెన్యూ శాఖ అధికారులు చావలి భట్టిప్రోలు రోడ్డులో వారి కోసం వేచి చూశారు. అమృతలూ రు నుంచి బయలుదేరిన కేంద్ర బృందం చెరుకుపల్లి వరకు వచ్చి ఆగిపోయట ంతో స్థానిక వ్యవసాయ శాఖ అధికా రులు పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతూ ఈ క్రాప్, ఈ కేవైసీ చేసిన ప్రతి రైతు భూమిని వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి రికార్డులలో నమోదు చేస్తార న్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి నష్టపరిహారం అందుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధారా రవికిరణ్మయి చెన్నయ్య,జడ్పిటిసి తిరువీ ధుల ఉదయభాస్కరి బాలాజీ,తహసిల్దారు ధూళిపూడి వెంకటేశ్వరరావు, ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్వో రత్నాకర్, ప్రసాద్,ఆర్ బి కే సిబ్బంది,వి ఏ ఏ లు మైత్రేయి,ఎస్ రజిని అద్దేపల్లి,భట్టిప్రోలు రైతులు, అధికారులు పాల్గొన్నా రు.

## అంగన్వాడీల నిరవధిక సమ్మెను విరమించం



మద్దిపాడు, మేజర్‌న్యూస్: అంగనవాడి సమస్యలను పరి ష్కరించే వరకు నిరవధిక సమ్మె ఆపేది లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు తెలిపారు. మండల కేంద్రమైన మద్దిపాడులో అంగన్వాడీల చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్ర మానికి మద్దిపాడు అంగన్వాడి ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి నాతాని ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బంకా సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా అంగన్వాడీ సమస్యలను పరిష్కరించలేక పోయిందన్నారు. ఇకనైనా జగన్మోహన్ రెడ్డి కళ్ళు తెరవాలని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్క రించాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శులు పల్లాపల్లి ఆంజనేయులు, సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు నల్లమలకు జయప్రద, రజిని, రాధా, ప్రమీల, ఆదిలక్ష్మి, మేరీ, ప్రభావతి, శారద, కళ్యాణి అంగన్వాడి టీచర్లు, ఆయాలు దాదాపు 170 మంది వరకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు
## ఆర్థిక అవగాహన సదస్సు



తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో నాగం బోట్లపాలెం మన్నేపల్లి సొసైటీ పరిధిలోని రైతులకు నా వార్డు పిడిసిసి బ్యాంక్ రైతులకు ఆర్థిక అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. నాగం బోట్లపాలెం సొసైటీ అధ్యక్షులు యాడిక యలమందారెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది మాట్లాడుతూ రైతులకు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకుల ద్వారా నా బార్డు ద్వారా తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కలుగుతుందని అన్నారు. సొసైటీ అధ్యక్షులు యాడిక యలమం దా రెడ్డి మాట్లాడుతూ రైతులు బ్యాం కుల ద్వారా పంట రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధికి తోడ్పాటు అందు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి సిఈఓ పులి శ్రీనివాస్ రెడ్డి, కటకంశెట్టి శ్రీనివాసరావు, పీ.దేవ దానం, ఏంఎల్ఓ బి.నాగ మల్లేశ్వర రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ పావులూరి వెంకటేశ్వర్లుకి ఘన నివాళి



మద్దిపాడు, మేజర్‌న్యూస్: కమ్యూనిస్టులు నేటి తరానికి ఆదర్శవంతులని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి అంజయ్య నగర్‌కు చెందిన కామ్రేడ్ నల్లూరి అంజయ్య అనుచరుడు కామ్రేడ్ పావులూరి వెంకటే శ్వర్లు(95) మృతి చెందడంతో ఆయన భౌతికాయానికి కమ్యూనిస్టు పార్టీ నాయకులు సిపిఐ పార్టీ జెండాను కప్పి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నల్లూరి వెంకటేశ్వర్లు అన్న మాట్లాడుతూ కామ్రేడ్ పావులూరి వెంకటేశ్వర్లు కామ్రేడ్ నల్లూరి అంజయ్య,కామ్రేడ్ ఎద్దు సుబ్బారావులతో కలిసి కూలీల సమస్యల పైన, గ్రామంలోని త్రాగునీటి సమస్యపై పోరాటం చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కామ్రేడ్ పావులూరి వెంకటేశ్వర్లు- నారాయణమ్మ దంపతులకు ఇరువురు కుమారులు ముగ్గురు కుమార్తెలు సంతానం. పలువురు కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాల నాయకులైన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్ నారాయణ, జిల్లా రైతు సంఘం నాయకులు వడ్డే హనుమాన్ రెడ్డి, డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువాది సుబ్బారావు, పిడిఎస్యు మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దులూరి ఆంజనేయులు చరవాణి ద్వారా పావులూరి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయడం జరిగింది. ఆయన బౌద్ధకాయాన్నికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), కమ్యూనిజం మాసపత్రిక సంపాదకులు ఎంసీ వెంకటేశ్వర్లు, సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి, సిపిఎం జిల్లా నాయకురాలు ఉబ్బ ఆదిలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నల్లూరి గోవిందయ్య గోగినేని వెంకటేశ్వ రరావు, కౌన్సిలర్ కార్యవర్గ సభ్యులు మద్దులూరి అంజయ్య, పెద్దకొత్తపల్లి సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి నల్లజర్ల శ్రీనివాసరావు, మారేళ్ళగుంట పాలెం సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి నల్లూరి రామారావు, అంజి నగర్ సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి అంగలకుర్తి వెంకటరావు, సిపిఐ, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.